కూటమి పార్టీల ఎన్నికల హామీల్లో అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్‌కు అనుసంధానంతో రాష్ట్రప్రభుత్వం దీన్ని కొనసాగిస్తోంది. తొలివిడత జిల్లాలోని రైతులకు రూ.185.72కోట్ల మేర నగదు అందనుంది. మొత్తం జిల్లాలో 2,65,317 మందిని ఈ పథకానికి అర్హులుగా అధికారులు గుర్తించారు. తొలివిడత ఒక్కొక్కరికి రూ.7వేల వంతున నగదును ఇవ్వనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 2న తాను ప్రాతినిథ్యం వహిస్తున్న వారణాసి నుంచి కేంద్రం వాటా నిధుల జమను లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అదేరోజున మన జిల్లా నుంచే సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు.



సాగుకు సాయం

2న అన్నదాత సుఖీభవ ప్రారంభం



తూర్పువీరాయపాలెం వద్ద అధికారులకు సూచనలిస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి


సీఎం పర్యటన ఖరారు

2న దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు రాక

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి
- అధికారులకు పలు సూచనలు

ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన వచ్చే నెల 2న దర్శి మండలం తూర్పువీరాయపాలెం వస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగ్రామంలో జరిగే సభలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన స్థలాన్ని బుధవారం సాయంత్రం జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్

మిగతా 6వ పేజీలో



తొలివిడత రూ.185.72 కోట్ల నగదు రైతుల ఖాతాలకు జమ

- జిల్లాలో 2,65,317 మంది అర్హులు
- దర్శిలో అధికం

ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలను అర్హులైన రైతులకు ఇవ్వనున్నట్లు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో ఒకటిగా కూటమి పార్టీలు ప్రకటించాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్‌తో అనుసంధానం చేసి అమలు చేయాలని నిర్ణయించాయి. గతంలో వైసీపీ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్రం ఏటా ఇచ్చే రూ.6వేలకు మరో రూ.7500 కలిపి రూ.13,500ను రైతు భరోసా పేరుతో ఇచ్చింది. ప్రస్తుత ప్రజా ప్రభుత్వమే ఒక్కో రైతుకు రూ.14వేలను అన్నదాత సుఖీభవ పేరుతో ప్రకటించింది. పీఎం కిసాన్‌తో అనుసంధానం చేసి కేంద్రం ద్వారా వచ్చే రూ.6వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్రం ఏడాదిలో మూడు విడతలుగా ఒక్కోసారి రూ.2వేల వంతున రైతుల ఖాతాల్లో జమ చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.14వేలను మూడు విడతలుగా ఇవ్వాలని నిర్ణయించింది. ఆ ప్రకారం తొలి దఫా నగదు జమలను

నియోజకవర్గాల వారీ అర్హులైన రైతుల వివరాలు

నియోజకవర్గం	రైతుల సంఖ్య
దర్శి	42,786
కనిగిరి	41,817
వైపాలెం	38,716
గిద్దలూరు	37,130
కొండపి	36,329
మార్కాపురం	32,711
ఎస్ఎన్‌పాడు	26,600
ఒంగోలు	9,228

మిగతా 6వ పేజీలో

ఇంటి వద్దకే ఈ సేవలు

- పట్టణ ప్రాంతాల్లో డీజీ లక్ష్మి పథకం అమలు
- పొదుపు సభ్యులతో కామన్ సర్వీస్ సెంటర్లు
- మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు
- నిర్వహణ బాధ్యతలపై మెప్మా చర్యలు వేగవంతం

త్వరలోనే అందుబాటులోకి సేవలు



జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్, ఇతర మునిసిపాలిటీల్లో మొత్తం 326 స్లమ్ లెవల్ ఫెడరేషన్‌లు ఉన్నాయి. ఇప్పటివరకు 270 మందిని డీజీ లక్ష్మి పథకానికి అర్హులుగా గుర్తించాం. అందులో భాగంగా బయోమెట్రిక్ పరికరాలు అందజేశాం. ఈశ్రమ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అమలు చేస్తున్నాం. త్వరలోనే డీజీ లక్ష్మి పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు సీఎం చేతుల మీదుగా సర్వీస్ నిర్వహణ పత్రాలను అధికారపూర్వకంగా అందజేస్తాం. జిల్లావ్యాప్తంగా పొదుపు సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

\- పి.శ్రీహరి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్



బయోమెట్రిక్ పరికాలు అందుకున్న లబ్ధిదారులతో మెప్మా పీడీ శ్రీహరి

కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సేవలు పొందాలంటే ఇప్పటి వరకూ ఆన్‌లైన్, మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్‌లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. అయితే ప్రస్తుత ఈ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణ పొదుపు సభ్యులతో ఇంటి వద్దనే సేవలు పొందే విధంగా ఉపాధి, ఆర్థిక తోడ్పాటు అందించడానికి డీజీ లక్ష్మి (డిజిటల్ గవర్నెన్స్ లక్ష్మి) పేరుతో పథకాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. దీంతో ఇకపై పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల వద్దనే ఈ-సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీని అమలుకు మెప్మా, కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చర్యలు వేగవంతం చేశారు.

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా లభించే సేవలను మహిళలు ఇంటి వద్దనే నిర్వహించుకుని స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ లక్ష్మి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ఈ-గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ తోడ్పాటుతో పట్టణాల్లోని స్లమ్ లెవల్ సమాఖ్య పరిధిలో ఒక కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను నెలకొల్పనున్నారు. వీటి ద్వారా మీసేవా కేంద్రాల్లో అందించే అన్ని రకాల ప్రభుత్వ ఆన్‌లైన్, డిజిటల్ సేవలను అందించనున్నారు. జిల్లాలో సుమారు 326 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

డీజీ లక్ష్మి పథకం అంటే..

డిజిటల్ గవర్నెన్స్ లక్ష్మి పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి, నిర్వహించడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక సహాయం

మిగతా 6వ పేజీలో

హైలెవల్ బ్రిడ్జి ప్రతిపాదిత ప్రాంతం



పాలేరుపై హైలెవల్ బ్రిడ్జి

నిర్మాణానికి రూ.27.83 కోట్లు మంజూరు

- ముప్పాళ్ల వద్ద ఏర్పాటుకు సన్నాహాలు
- చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలకు తీరనున్న కష్టాలు

7లో

స్మార్ట్ కార్డులు రెడీ

- వచ్చేనెల 25నుంచి రైస్ కార్డుల స్థానంలో పంపిణీ
- దానిపై ఇంటి యజమాని ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు
- రాజముద్ర, క్యూఆర్‌కోడ్
- జిల్లావ్యాప్తంగా 6.61 లక్షల మందికి ఇవ్వనున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అక్రమాలను అరికట్టడంతోపాటు పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగపడే విధంగా రైస్‌కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు సన్నద్ధమైంది. క్యూఆర్ కోడ్ ఉండే ఈ స్మార్ట్‌కార్డులను వచ్చేనెల 25 నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 1,392 రేషన్‌షాపుల పరిధిలో 6,61,187 తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఉన్న రైస్ కార్డుల్లో



మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ బస్సులో నోట్ల కట్టలు!

రూ.49.45 లక్షలు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఒంగోలు, క్రైం 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో భారీ మొత్తంలో తరలిస్తున్న నగదును ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. రూ.49.45లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో రూ.49.45 లక్షల నగదును గుర్తించారు. ఆ మొత్తాన్ని తరలిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంనకు చెందిన గొర్ల సాయిమణికంఠను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా చెన్నైలో బంగారం కొనుగోలుకు నగదును తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదు మొత్తంతోపాటు సాయిమణికంఠను టంగుటూరు పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జనార్దన్‌రావు, సీఐలు నరహరిరావు, రామారావు, ఎస్సై రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎక్సైజ్ అధికారులు



కొండపి గ్రామ సచివాలయంలో నామినేషన్‌ల స్వీకరణకు వేచి చూస్తున్న అధికారులు

తొలిరోజు నామినేషన్లు నిల్

- కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

కొండపి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీకి ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆర్వో జె.రవిబాబు బుధవారం విడుదల చేశారు. ఆ వెంటనే నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేవారు రూ.1,500, వార్డు సభ్యుడిగా నామినేషన్ వేసే జనరల్ కేటగిరీకి చెందిన వారు రూ. 1,000, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన వారు రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఆర్వో వివరించారు. నామినేషన్‌కు ఆర్నెళ్లలోపు తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రాన్ని

మిగతా 6వ పేజీలో

జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు

- ఒంగోలులో జేసీ గోపాలకృష్ణ, దర్శి ప్రాంతంలో డీఎస్‌వో పరిశీలన
- ఇతరచోట్ల రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు
- 146 ప్రాంతాల్లో సోదాలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలతో పెట్రోలు బంకులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గ్యాస్ కంపెనీలు, రేషన్ షాపులు, సినిమా థియేటర్లు తదితర చోట్ల సోదాలు చేశారు. జేసీ గోపాలకృష్ణ ఒంగోలు ఆర్టీసీ బస్టాండులోని షాపులను సందర్శించి అక్కడ తినుబండారులను పరిశీలించారు. నగరంలోని గ్యాస్ కంపెనీలతోపాటు పెట్రోలు బంకులు, ఆయిల్ మిల్లులు, ఆర్వో ప్లాంట్లను ఆయన సందర్శించారు. అక్కడ అన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. ధరల పట్టికలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ, సివిల్ సప్లయీస్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఉన్నారు. డీఎస్‌వో పద్మశ్రీ, దొనకొండలో ఎంఎల్ఎస్ పాయింట్‌తోపాటు దర్శిలో పెట్రోలు బంకు, చీమకుర్తిలో రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. నెలవారీ చేస్తున్న ప్రక్రియలో భాగంగా ఆయా శాఖల అధికారులు చేసిన తనిఖీల నివేదికలను జాయింట్ కలెక్టర్‌కు పంపనున్నారు. కాగా జిల్లాలో పెట్రోలు బంకులు 38, గ్యాస్ ఏజెన్సీలు 9, రేషన్ షాపులు 50, ఎంఎల్ఎస్ పాయింట్లు 9, రైస్ మిల్లులు ఆరు, బాణసంచా గోడౌన్లు 3, ఆర్వో ప్లాంట్లు 22, ఆర్టీసీ బస్టాండ్లు రెండు, హోటల్స్ రెండు, ఐస్‌క్రీం పార్లర్ ఒకటి, ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్ యూనిట్ ఒకటి, ఐదు థియేటర్లను పరిశీలించారు.



ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండులో తినుబండారాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఏఆర్‌టీ సెంటర్‌ల నిర్వాహకులకు డీఎంహెచ్‌వో హెచ్చరిక
- ఒంగోలులో పలు కేంద్రాల తనిఖీ
- రికార్డులు, ఫీజుల పట్టికల పరిశీలన

7

లోగ్రేడ్‌ను కొనుగోలు చేసి రైతులను ఆదుకోండి

- పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్
- పొదిలిలో వేలం పరిశీలన
- పరిమితికి మించి పంట సాగు చేయవద్దని రైతులకు సూచన

7

సాగుకు సాయం

(5వ పేజీ తరువాయి)

ఆగస్టు 2నుంచి ప్రారంభించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం పెద్ద కసరత్తునే చేసింది. పారదర్శకంగా సాగడంతో ఎక్కడా పెద్దగా అభ్యంతరాలు రాలేదు. తొలుత వెబ్‌ల్యాండ్ ఆధారంగా మొత్తం రైతు కమతాలను గుర్తించి వారిలో పథకం నిబంధనల ప్రకారం అర్హత ఉండే వారిని గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రజాప్రతినిధులు వంటి వారిని తొలుత మినహాయించారు. తర్వాత ఒక కుటుంబంలో ఒకరికే లబ్ధి కనుక కుటుంబ సర్వే ఆధారంగా పరిశీలన చేశారు. అలాగే ఆధార్‌తో అనుసంధానం అయిన బ్యాంకు అకౌంట్లను ఈకేవైసీ చేయించారు. అంతిమంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. మొత్తం ప్రక్రియ వ్యవసాయ, రెవెన్యూ శాఖల యంత్రాంగం పరిశీలనలో సాగింది.

ఒక కుటుంబంలో ఒక్కరికే!

జిల్లాలో చూస్తే మొత్తం 5.31 లక్షల రైతు ఖాతాలు ఉన్నట్లు వెబ్‌ల్యాండ్ ప్రకారం గుర్తించారు. ఆ జాబితాలను క్షేత్రస్థాయిలోని వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి పథకం నిబంధనల పరిధిలో 4.90 లక్షల మంది ఉన్నట్లు తేల్చారు. ఆమేరకు ప్రభుత్వానికి నివేదించగా కుటుంబ సర్వే ప్రకారం ఉన్నత స్థాయిలో పరిశీలించి ఒక కుటుంబానికి ఒక్కరికే అన్నదాని ప్రకారం తుది జాబితాను రూపొందించారు. ఆప్రకారం గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాలలో జాబితాను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి తుది పరిశీలన చేశారు. చివరకు జిల్లాలో ఈ పథకం వర్తింపునకు అన్ని అర్హతలు ఉన్నవారు 2,65,317 మందిగా తేల్చారు. ఇందులో దర్శి నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. మొత్తం అర్హులైన 2,65,317 మందికి తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.7వేల ప్రకారం రూ.185.72 కోట్లు నగదు అందనుంది. ఆగస్టు 2నుంచి ఈ నగదు రైతు ఖాతాల్లో జమ కానుంది.

సీఎం పర్యటన ఖరారు

(5వ పేజీ తరువాయి)

తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆ ప్రాంతంలో పర్యటించి ఖరారు చేశారు. 2వ తేదీ ఉదయం 11 గంటలకు వీరాయపాలెం చేరుకునే సీఎం సాయంత్రం నాలుగు గంటల వరకూ అక్కడే ఉంటారు. తొలుత అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గస్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. గతానికి భిన్నంగా ప్రస్తుతం భారీ బహిరంగ సభలకు స్వస్తి చెప్పి పరిమిత సంఖ్యలో ఆయావర్గాల ప్రజలతో ఇష్టాగోష్టి తరహాలో సమావేశాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవాన్ని కూడా అలానే నిర్వహించనున్నారు. దీంతో కార్యక్రమానికి ఎంపిక చేసిన తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన వారితోపాటు పరిమిత సంఖ్యలో పరిసర గ్రామ ప్రాంత రైతులతో సభ నిర్వహించాలని నిర్ణయించారు.

సీఎంవో అధికారుల జూమ్ కాన్ఫరెన్స్

కార్యక్రమ నిర్వహణపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లతో బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ ప్రకారం హెలీప్యాడ్, రైతుల సభ, కార్యకర్తల సమావేశం అన్నీ దగ్గరదగ్గరగా ఒకే ప్రాంతంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయనుండగా ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాత్రి సంబంధిత జిల్లా అధికారులతో మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా తూర్పువీరాయపాలెంలో సమీక్ష చేసి తగు ఆదేశాలు ఇచ్చారు.

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లకు యంత్రాంగం సిద్ధమైంది. గురువారం ఉదయం నుంచి అక్కడ ఏర్పాట్లు ప్రారంభంకానున్నాయి. తొలుత తూర్పువీరాయపాలెంతోపాటు రాజంపల్లి, దర్శి శివారులోని శివరాజునగర్, ఇతర మరికొన్ని ప్రాంతాలను పరిశీలించినప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయ సూచనలకు అనుగుణంగా కార్యక్రమ నిర్వహణకు తూర్పువీరయపాలెం అనువుగా ఉంటుందని భావించి అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, పలువురు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

రైతులు పండించిన పొగాకంతా కొనుగోలు చేస్తాం

● చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. సంతమాగులూరు మార్కెట్ యార్డు లో పొగాకు కొనుగోలు కేంద్రా న్ని ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా అయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమకు నిర్ధేశించిన సమయానికి పొగాకును తీసుకుని వచ్చి అమ్ముకోవాలన్నారు. గ్రేడ్‌ల వారీగా పొగాకును తీసుకు రావాలన్నారు. నిబంధనల మేరకు పొగాకును కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ పరిశీలనలో మార్కెట్ యార్డు చైర్మన్ తేలప్రోలు రమేష్, తహసీల్దార్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.


సంతమాగులూరు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రైతులు అధైర్యపడవద్దు

చినగంజాం :నల్ల బర్లీ పొగాకు రైతులు అధైర్యపడొద్దని, చివరి ఆకు వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీలు అన్నారు. చినగంజాం లోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జె.ప్రభాకరరావు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. చింతగుంపల్లె పీఏసీఎస్ సీఈవో జి.శేఖర్, పొగాకు బయ్యర్లు, బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి కే. శ్యాంబాబు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కేవైసీ చేయించుకోని వారి జాబితా రైతుసేవా కేంద్రాలలో ఉన్నదని, 221 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని ఏవో తెలిపారు. పథకం లబ్ధి పొందే రైతులు తమ బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేసే ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని సూచించారు. పంటసాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, గుంటుపల్లి రాధాకృష్ణ, వ్యవసాయ సహాయకులు పవిత్ర, రోజీ, రైతులు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : మండలంలోని సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతుల తమ బ్యాంకు అకౌంట్ల నెంబర్లకు ఎన్‌పీసీఐ యాక్టీవ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


చినగంజాం : పొలం పిలుస్తుంది గ్రామసభలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్

విత్తనాలు కొనేటప్పుడు

తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి

ఇంకొల్లు: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే టప్పుడు తప్పని సరిగా బిల్లు పొందాలని మండల వ్యవసాయాధికారి మేరమ్మ అన్నారు.లైసెన్సు ఉన్న దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.బుధవారం మండలంలోని భీమవరం,కొణికి గ్రామాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు సూచించండి

● డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులోని ఖాతాదారులకు సైబర్ నేరాలపై కచ్చితమైన జాగ్రత్తలు సూచించి నేర నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాపనమ్మ కల్యాణ మండపంలో అన్ని బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. అలాగే సెక్యూరిటీ పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్, ఇతర బ్యాంకుసేవలు వినియోగించుకునే ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.


సైబర్ నేరాలపై మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

అలాగే బ్యాంకు అధికారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు శేషగిరిరావు, నాగభూషణం, ఎస్సైలు చంద్రశేఖర్. జనార్ధన్, రాజ్యలక్ష్మి, వాణీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ (డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి

విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన విద్యాలయంలో విధులలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు అని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ(డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను అయన పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ట్యాబ్‌ల ద్వారా ఎలా చదువుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనకబడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రవినాయక్ పాల్గొన్నారు.

గోడౌన్‌ల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత

పర్చూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసి నిల్వచేసే విధంగా అందుబాటులో ఉన్న గోడౌన్‌లను సిద్ధం చేయాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్, ఎండీ విజయ సునీత అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులకు సరిపడ గోడౌన్‌లు అందుబాటులో లేకపోవటంతో కొనుగోలుకు కొంత ఇబ్బందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇడుపులపాడు మేజరు మరమ్మతులు ప్రారంభం

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలో ఉన్న ఇడుపులపాడు సాగర్ మేజరు కాల్వ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. కాల్వకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లతో పాటు కాల్వ పూడిక తీత పనులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు, కొణికి పీఏసీఎస్ చైర్మన్లు కరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, నీటి సంఘం అధ్యక్షుడు బత్తుల రామకృష్ణ, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పర్చూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల అలవాటుకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దని ఎస్సై జీవీ చౌదరి సూచించారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, ఎస్సై సాంబశివరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఈ సేవలు

(5వ పేజీ తరువాయి)

అందిస్తుంది. ఈ కేంద్రాల ద్వారా ప్రజలు 20రకాల డిజిటల్ ప్రభుత్వ సేవలను పొందవచ్చు. వీటిలో ఆధార్ అప్‌డేట్స్, విద్యుత్, ఇంటి, నీటి పన్నులు, రేషన్ కార్డుల సేవలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, బస్, రైలు టిక్కెట్ల రిజర్వేషన్, వివిధ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు, కియోస్క్, కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రూ.2.5 లక్షలను బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తారు. అవసరమైన ట్యాబ్‌లను ఇస్తారు.

పథకానికి అర్హులు వీరే

పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలి. మూడు సంవత్సరాల నుంచి సభ్యత్వం కలిగి ఉండాలి. వివాహమై అదే ప్రాంతంలో నివాసం కలిగి ఉండాలి. స్మార్ట్‌ఫోన్, సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండటంతోపాటు, 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు, డిగ్రీ అర్హత అవసరం. ఒంగోలు కార్పొరేషన్‌లో 164, మార్కాపురం 64, గిద్దలూరులో 35, కనిగిరి 31, దర్శి 15, చీమకుర్తిలో 20, స్లమ్ లెవల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్)లు ఉండగా వాటి పరిధిలో డీజీ లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్‌లు ఏర్పాటు చేయనున్నారు.

స్మార్ట్ కార్డులు రెడీ

(5వ పేజీ తరువాయి)

ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫొటో ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుంది. ఇతర సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేస్తారు. గతంలో రైస్ కార్డులపై ఎవరు అధికారంలో ఉంటే ఆ సీఎం ఫొటోలు కార్డులపై ఉండేవి. ఇప్పుడు ఈ స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుంది. ప్రస్తుతం ఇవ్వనున్న స్మార్ట్ కార్డులు బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉండనున్నాయి. పారదర్శకతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేస్తారు. తద్వారా రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చని అధికారులు చెప్తున్నారు.

తొలిరోజు నామినేషన్‌లు నిల్

(5వ పేజీ తరువాయి)

జత చేయాలని సూచించారు. నోటిఫికేషన్ ప్రక్రియను, నామినేషన్ల సెంటర్‌ను కొండపి ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో స్టేజ్-2 ఎన్నికల అధికారి బి.ప్రసాదరావు, ఈవోఆర్డీ అంజలీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

మార్టూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోటరీ క్లబ్ సభ్యులు విద్యార్థులకు భోజనప్లేట్లను, గ్లాసులను ఎంఈవో వస్రాం నాయక్ పంపిణీ చేశారు. అదేవిధంగా స్కూలుకు 4 కుర్చీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎం సాంబ శివరావు, జీహెచ్ నాగేశ్వరరావు,రావి అంకమ్మ చౌదరి, కె. హనుమంతరావు, చెరుకూరి అంజిబాబు, జాష్టి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

మండలంలోని కోనంకి విద్యుత్ ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మ్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు మార్టూరు సబ్ డివిజన్ డీఈఈ ఎం.సురేంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోనంకి పరిధిలోని కోనంకి, జొన్నతాళి,వలపర్ల, ఇసుకదర్శి, బొబ్బేపల్లి, చిమ్మిరిబండ గ్రామాలలో గృహ,వాణిజ్యపరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోరుతూ పోలీసులను ఆశ్రయించే దివ్యాంగ బాధితులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. బుధవారం డీఎస్పీ ఎండీ మొయిన్‌ను కలిసి కాలేషా మాట్లాడారు. స్టేషన్‌లకు వచ్చే వారి పట్ల ప్రేమగా మెలగాలని, వీల్ చైర్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేసి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంటనే సమస్యలపై పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కాలేషా వెంట పలువురు వికలాంగులు ఉన్నారు.

దేవాలయ భూములకు పెరిగిన కౌలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామంలో ఉన్న దేవాలయాల భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. ఈ ఏడాది దేవాలయ భూముల కౌలు వేలం పెరిగిందని దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు.రామలింగేశ్వరస్వామికి చెందిన 14.40 ఎకరాలకు రూ. 2.12 లక్షలకు వేలంలో రైతులు పాడారని అలానే చెన్న కేశవస్వామి ఆలయానికి చెందిన 6.25 ఎకరాల భూమికి రూ. 1.76 లక్షలకు వేలం పాడారు. గత ఏడాది కంటే వేలం పాట పెరిగిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం

అద్దంకి,జూలై30(ఆంధ్రజ్యోతి): అద్దంకి పురపాలక సంఘం అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. 20 అంశాల అజెండాతో సమావేశం జరుగుతుందన్నారు.

స్వామిత్వ సర్వేపై సిబ్బందికి శిక్షణ

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం కేంద్రంగా సాంకేతికతను వినియోగించి స్వామిత్వ సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి సంపద కార్డులు జారీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్ తెలిపారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాలలో స్వామిత్వ సర్వేపై సిబ్బందికి రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ నియామకం

రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు 2025 - 26 సంవత్సరానికి నూతన కమిటీ నియామకం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా పంగులూరుకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ, కార్యదర్శిగా అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావులు నియమితులయ్యారు.

ఉపాధ్యక్షుడిగా చిలుకూరి ప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా షేక్ కాలేషావలి, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా గుర్రం ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా రావూరి రంగారావు నియమితులయ్యారు. ఈ నెల 31న నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది.

భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడండి

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య అన్నారు.ఇంకొల్లు సర్కిల్ కార్యాలయంలో బుధవారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూడాలని అన్నారు. ఇంకొల్లు ఎస్సై సురేష్,ఇంకొల్లు పరిధిలోని అన్నీ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.


మంజూరు పత్రం అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్‌కు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరు

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరయినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తద్వారా ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీ, కాన్సెప్ట్ రీసెర్చ్, ట్రెండ్స్ అండ్ ప్రాసెస్, చాలెంజెస్, పాలసీ అండ్ కాంపిటెన్స్‌కు సంబంధించి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 6 రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించిన పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



దాడి వివరాలను కమిషనర్‌కు వివరిస్తున్న కాంట్రాక్టర్ దండూరి కోటేశ్వరరావు

కాలువ పనులు అడ్డగించి కాంట్రాక్టర్‌పై దాడి

ఒంగోలు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ అభివృద్ధి పనులు చేపడుతున్న మునిసిపల్ కాంట్రాక్టర్ దండూరి కోటేశ్వరరావుపై వరికూటి ఆంజనేయులు దాడికి పాల్పడ్డాడు. బుధవారం స్థానిక ఒకటవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలోని రెడ్డి హాస్టల్ వద్ద రూ.50 లక్షల వ్యయంతో ప్రధాన కాలువ పనులు జరుగుతుండగా, కాలువ పనులకు సమీపంలోని సిమెంట్ బల్లల తయారీ ప్లాంట్ ముందు అడుగు ఎత్తులో ఆంజనేయస్వామి బొమ్మ ఉంది. దీంతో కాంట్రాక్టర్ పనికి అడ్డంగా ఉందని, దానిని తీసి మరోచోట ఏర్పాటు చేసుకోవాలని ప్లాంట్ వ్యాపారి వరికూటి ఆంజనేయులను కోరారు. అంగీకరించని ఆంజనేయులు ఆ బొమ్మ తీసే పనిలేదని, అవసరం అయితే కాలువను పక్కకు మరల్చి కట్టుకోవాలని బదులిచ్చారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, వరికూటి ఆంజనేయులు మరింత రెచ్చిపోయి, కాంట్రాక్టర్ కోటేశ్వరావుపై కర్రతో దాడి చేయడంతో అక్కడే ఉన్న పది అడుగుల లోతు కాలువలో పడిపోయారు. మరింత రెచ్చిపోయిన ఆంజనేయులు తీవ్రస్థాయిలో దాడి చేయడంతో కాంట్రాక్టర్ స్పృహ కోల్పోయారు. దీంతో అక్కడే ఉన్న కాలువ పనులు చేసే కూలీలు ఆయన్ను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న నగర కమిషనరు వెంకటేశ్వరరావు, డివిజన్ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి తెలుసుకుని బాధితుడిని పరామర్శించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

ఒంగోలు క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో సెల్‌ఫోన్లు చూసుకుంటూ డోర్‌లో నిలబడిన వారిని లక్ష్యంగా చేసుకొని కింద నుంచే కర్రతో కొట్టి సెల్‌ఫోన్ కింద పడటంతో దొంగతనంనకు పాల్పడే వ్యక్తిని పట్టుకొని 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సీఐ మౌలా షరీఫ్ తెలిపారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిచారు. ఒంగోలు భాగ్యనగర్‌కు చెందిన పాతనేరస్థుడు షేక్ రఫీని రైల్వే స్టేషన్ వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అతను గతంలో అనేక దొంగతనాలు చేశాడని, పలు పోలీసు స్టేషన్‌లలో ఉన్నాయని చెప్పారు. అతని వద్ద సుమారు రూ.50 వేలు విలువ చేసే 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నేడు ఆర్‌ఎం ఆఫీసు వద్ద ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకు లోగ్రేడ్ క్వింటా రూ.20వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరుతూ గురువారం స్థానిక పొగాకు బోర్డు ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతిబాబు, పమిడి వెంకట్రావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పొగాకును ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేసేందుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు రైతులు తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటైనర్

ఒంగోలు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముందు వెళతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. ఈ ఘటన పెళ్లూరు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద బుధవారం జరిగింది. ఒంగోలు నుంచి టంగుటూరు వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి నెల్లూరు వైపు వెళ్లే కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

శాస్త్రసాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచాలి

ఒంగోలు విద్య, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన,శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం ఒంగోలు డివిస్‌స్థాయి సైన్స్ టీచర్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు డివిజన్ విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సృజనాత్మకమైన, నూతనత్వంతో కూడిన, పర్యావరణహితమైన, సామాజిక సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా నూతన అవిష్కరణలను ప్రొత్సహించాలన్నారు. ఇన్‌స్పైయిర్‌మనక్ నామినేషన్లు జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్, ఆదర్శ కస్తూర్బా, ప్రైవేటు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులు ఈ ప్రాజెక్టులను ప్రొత్సహించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు వినూత్న ఆలోచనలు పెంపొందించే విధంగా కృషి చేయాలన్నారు.

గ్రాసం కోసం వెళ్లి బావిలో పడ్డ గేదె

● 4 గంటల పాటు శ్రమించి బయటకు తీసిన గ్రామస్థులు



గేదెను బయటకు తీస్తున్న జేసీబీ

పీసీపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రాసం కోసం పొలం వెళ్లిన గేదె గడ్డిని మేస్తూ ప్రమాదవశాత్తూ బావిలో జారిపడింది. గుర్తించిన గామస్థులు 4 గంటల పాటు శ్రమించి బావిలో నుంచి గేదెను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన మండలంలోని మలినేనివారిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. మలినేనివారిపల్లి గ్రామానికి చెందిన మలినేని వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకున్న గేదెలను పశుగ్రాసం కోసం ప్రతిరోజూ గ్రామ సమీపంలోని సాదంవారి చేనుకు గేదెలను తోలుకెళ్తారు. ఎప్పటిలాగే బుధవారం కూడా గేదెలను పొలానికి తోలుకెళ్లారు. ఒక గేదె గడ్డిని మేస్తూ పొదల్లో ఉన్న బావిచెంతకు వెళ్లింది. ప్రమాదవశాత్తూ గేదె బావిలో పడింది. అయితే బాలో పడిన గేదె బయటకు వచ్చే మార్గం లేక అరవడం మొదలుపెట్టింది. అరుపులు విన్న పశుపోకులు బావి వద్దకు వెళ్లి చూడగా గేదె బావిలో పడిపోయింది. దీంతో వారు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. బావి వద్దకు చేరుకున్న గ్రామస్థులు మోకులు కట్టి బయటకు తీసేం దుకు ప్రయత్నించారు. మార్గం సరిగా లేకపోవడంతో గేదె బయటకు రాలేకపో యింది. చివరకు జేసీబీని తీసుకొచ్చి తాళ్లతో గేదెకు ఉట్టిలా కట్టి బయటకు తీసుకొచ్చారు. 4 గంటల పాటు శ్రమించి గేదెకు ఎటువంటి గాయాలు కాకుండా బయటకు తీయడంతో పశుపోషకులు ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

సింగరాయకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ యువకుడు వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఊళ్ల పాలెంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కందుకూరు మండలం ఓగూరు గ్రామానికి చెందిన ఏపూరి నాగరాజు (28) చిన్నతనం నుంచి తల్లితో కలిసి మండలంలోని ఊళ్లపాలెంలో ఉంటున్నాడు. 7వ తరగతి వరకు చదువుకొన్నాడు. కొన్నేళ్ల తరువాత ట్రాక్టర్ నేర్చుకొని డ్రైవర్‌గా పనిచేశాడు. రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని మానసిక పరిస్థితి కూడా దెబ్బతింది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజా మున 5 గంటలకు బహిర్భూమికి అని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. గ్రామంలోని కావూరి దిబ్బ వద్దకు వెళ్లి వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.



రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

లోగ్రేడ్‌ను కొనుగోలు చేసి రైతులను ఆదుకోండి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొదిలి, జులై 30 (ఆంధ్రజ్యోతి) : లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని పొగాకు బోర్డు చైర్మన్ సిడిపోతు యశ్వంత్ కుమార్ అన్నారు. బుధవరం పొదిలి పొగాకు బోర్డు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరిగిన పొగాకు వేలం సరళిని ఆయన పరిశీలించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో మంచి ధరలతో లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేసి వ్యాపారస్తులు రైతులకు అండగా నిలవాలని ఆయన కోరారు. వేలం కేంద్రంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాబోయే పంట కాలానికి బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగు చేసేలా రైతులు పరిమితం కావాలన్నారు. పరిమితికి మించి రైతులు పొగాకును సాగుచేస్తే వ్యవసాయ ఖర్చులు పెరిగి రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయంగా భారతీయ పొగాకు ముఖ్య పోటీదారులుగా ఉన్న బ్రెజిల్, జింబాంబ్వే దేశాలు మాత్రమే కాకుండా నూతనంగా టాంజానియా, ఉగాండా, మలావి వంటి దేశాలు కూడా ఎఫ్‌సీవీ పొగాకును సాగుచేసి అంతర్జాతీయంగా పోటీ ఇస్తున్నాయన్నారు. భారతీయ పొగాకు రైతులు పరిమితమైన పంటనే సాగుచేసి నాణ్యమైన దిగుబడిని సాధించాలని ఆయన కోరారు. వ్యాపార వర్గాలతో సమావేశంలో ఒక్క లోగ్రేడ్ పొగాకు మాత్రమే వేలం కేంద్రాలకు వస్తున్నందున అందులోనికి బ్లెండ్ చేసుకునేందుకు కావాల్సిన బ్రైట్ గ్రేడ్, మీడియం గ్రేడ్ పొగాకు రైతులు వేలం కేంద్రాలకు తీసుకుని రాకపోవడం వల్ల మరింత లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయలేకపోతున్నామని వ్యాపారులు తెలియజేశారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు అన్ని రకాల పొగాకు గ్రేడ్‌లను వేలం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రాబోయే పంటకాలానికి అధిక మొత్తం వెచ్చించి బ్యారన్‌లు, పొలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయడం క్షేమం కాదని ఆయన అన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో లోగ్రేడ్ పొగాకు కొనుగోలులో సంక్షోభం ఏర్పడినప్పటికీ అన్ని కంపెనీల యాజమాన్యాలతోను, ఉన్నతాధికారులతోనూ మాట్లాడి లోగ్రేడ్ కొనుగోలుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. కనుక రైతులు అధైర్యపడకుండా మార్కెట్ సరళిని గమనించి బోర్డు అధికారులు సూచించిన మేరకు మాత్రమే బేళ్లను వేలం కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అదనపు పంటను అమ్ముకునేందుకు కేంద్రప్రభుత్వం అనుమతులు త్వరలో వస్తాయని ఆయన తెలిపారు. రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును అమ్ముకునేందుకు బోర్డు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పాలేరుపై హైలెవల్ బ్రిడ్జి

● నిర్మాణానికి రూ.27.83 కోట్లు మంజూరు

● ముప్పాళ్ల వద్ద ఏర్పాటుకు సన్నాహాలు

● చుట్టుపక్కల 20 గ్రామాలకు తీరనున్న కష్టాలు



ముప్పాళ్లవద్ద బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతం

పొన్నలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా ముప్పాళ్ల ప్రాంత ప్రజలు ఎదురుచూపులకు మోక్షం లభించింది. మండలంలో పాలేరునదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తూ కేంద్రప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చింది. మండలంలోని ముప్పాళ్ల వద్ద పాలేరు నదిపై రూ.27.83 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి రూపుదిద్దుకోబోతోంది. ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకం కింద ఈ నిధులు మంజూరయ్యాయి. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవతోనే బ్రిడ్జి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ముప్పాళ్ల వద్ద పాలేరునది వెడల్పు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటుచేయాలని గతకొన్నేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కొండపి, జరుగుమల్లి, కందుకూరు, పొన్నలూరు మండలాల ప్రజలు ముప్పాళ్లమీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. కామేపల్లి నుంచి ముప్పాళ్ల మీదుగా తక్కువ దూరంలోనే కందుకూరు చేరుకోవచ్చు. పాలేరులో నీరు ఉన్నప్పుడు అటు విక్కిరాలపేట మీదుగా ఎక్కువ దూరం ప్రయాణించి కందుకూరు వెళ్లాల్సివచ్చేది. కొత్తగా నిర్మించబోయే బ్రిడ్జివల్ల కామేపల్లి, సతుకుపాడు, పైడిపాడు, రెడ్డిపాలెం, ముప్పాళ్ల, శింగరబొట్లపాలెం, వెల్లటూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పాలేరుపై 310 మీటర్ల దూరం బ్రిడ్జి నిర్మాణంతోపాటు రెండువైపులా అప్రోచ్‌రోడ్లు నిర్మించనున్నారు. ముందుగా మట్టినాణ్యత పరీక్షలు జరిపిన తరువాత పనులు మొదలుపెట్టే అవకాశముంది. మొత్తంమీద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుకావడంతో ఈ ప్రాంతప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఏఆర్‌టీ సెంటర్లలో డీఎంహెచ్‌వో తనిఖీలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏఆర్‌టీ, సిరోగసీ చట్టం కింద నమోదు చేసుకున్న అసిస్టెట్ రీప్రొడెక్షన్ టెక్నిక్ (ఏఆర్‌టీ) సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒంగోలులోని ఒయాసిస్, దుర్గ, బెతూన్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఏఆర్‌టీ సెంటర్లను బుధవారం తనిఖీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం సహాయక పునరుత్పత్తి కేంద్రాలు ఉండగా, ఆరు సిరోగసీ కేంద్రాలున్నాయి. ఏఆర్‌టీ కేంద్రాల్లో అందించే సేవలతో పాటు ధరల పట్టికలను పరిశీలించారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా ధరల పట్టికలను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఏర్పాటు చేయాలని ఆయా కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల రికార్డులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఏఆర్‌టీ కేంద్రాల రిజిస్ట్రర్ సమయంలో సమర్పించిన సిబ్బంది వివరాలను అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏఆర్‌టీ, సిరోగసీ సెంటర్లను నిర్వహిస్తే అటువంటి వాటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతినెలా ఏఆర్‌టీ, సిరోగసీ సెంటర్ల నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలన్నారు. జిల్లాలో రిజస్ట్రేషన్ లేకుండా ప్రైవేటు వైద్యశాలల్లో ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లను నిర్వహిస్తే అటువంటి వైద్యశాలలపై చట్టపరమైన చర్యలు తప్పవని డాక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు. అందుకు సంబంధించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.



ఒంగోలులో ఏఆర్‌టీ సెంటర్‌లో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు పాటుపడాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించే లక్ష్యంతో సూక్ష్మరుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్‌ప్లాన్), ఏసీఎల్‌పీ పథకాల అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం పలుశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థిరమైన జీవనోపాధి కల్పించేలా ఆయా శాఖల్లో సబ్సిడీ యూనిట్లను ఎలా అమలు చేస్తున్నారో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 45,297 స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 4.46 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. వీరి జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీరిలో గుర్తించబడిన పీ4 కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ వారి జీవన ప్రమాణాలు పెంచాలన్నారు. యూనిట్ల స్థాపనకు పొదుపు సంఘాల సభ్యుల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర శాఖల వార్షిక సుస్థిర జీవనపాదుల సంఘం సభ్యుల ద్వారా చేసేందుకు సెర్ప్‌తో సమన్వయం చేసుకోని పనిచేయాలన్నారు.

ఉద్యోగుల సమస్యలపై '5న రండి టీ తాగుతూ మాట్లాడుదాం'

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు వచ్చేనెల 5వ తేదీన ఒంగోలులో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై ఉద్యోగులతో టీ తాగుతూ చర్చించడం జరుతుందన్నారు. మూడు నెలల కాలంలో వారానికి ఒక సమస్యను లేవనెత్తుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ఈ చర్చావేదికల్లో చర్చించి రాష్ట్ర సంఘం ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చేనెల 5వ తేదీన జరిగే కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, రామన వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, రంగారెడ్డి, ఎం.శ్రీనివసరావు ఉన్నారు.



ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి



కార్డెన్ సెర్చ్ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, ఎస్సైలు

25 అనుమానాస్పద వస్తువులు స్వాధీనం

● వెస్ట్ పోతుల చెంచయ్య కాలనీలో కార్డెన్ సెర్చ్

● పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు

టంగుటూరు (కొండపి), జూలై 30: టంగూటూరులోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 74 మంది పోలీసు సిబ్బంది బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దాదాపు 400 గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 25 అనుమానాస్పద వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో డీఎస్పీ మాట్లాడారు. కాలనీలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే సమాచారం అందించాలని, సత్ప్రవర్తనతో యువకులు మెలగాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల నిషేధం తదితర విషయాలపై స్థానికులకు పలు సూచనలు చేశారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇళ్లకు తాళాలు వేసి బయట ప్రాంతాలకు వెళ్లేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌లో ఈ సమాచారాన్ని తెలపాలని డీఎస్పీ స్థానికులకు సూచించారు. యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావుతోపాటు మరో ఏడుగురు ఎస్సైలు పాల్గొన్నారు.

బైక్‌లపై హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, జూలై30(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎవరైనా బైక్‌లపై హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నగరంలో ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా బైక్‌లపై హల్‌చల్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారికి జరిమానాలు వేయడంతో పాటు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనచోదన చేయడం నేరమని చెప్పారు. అదేవిధంగా రహదారి నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు వాహనంపై ప్రయాణం చేయకూడదని చెప్పారు. వీరిలో ఎక్కువగా విద్యార్థులు ఉన్నారని, వారు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇలా ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడటంతోపాటుగా సైలెన్సర్లు మార్పు చేసి పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ తిరగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● పాటిమీదపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే బీఎన్



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై30(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బుధవారం సాయంత్రం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పాటిమీదపాలెంలో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, పాపిరెడ్డి, శివ పార్వతి, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, తాతినేని రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కమలశ్రీ

నాగులుప్పలపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వ్యాక్సినేషన్‌లో వైద్యఆరోగ్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి కమలశ్రీ సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల సిబ్బందితో నాగులుప్పలపాడు ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు తప్పనిసరిగా రెండు టీటీ ఇంజక్షన్లు అందించాలని సూచించారు. శిశువులకు టీకాలు తప్పనిసరిగా అందించాలన్నారు. పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణిలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఐరన్‌మాత్రలు అందించాలన్నారు. మూడు సార్లు ప్రభుత్వ వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, ప్రసన్న, కుమారస్వామి, ఒనారియల్, హెల్త్ సూపర్‌వైజర్ శౌరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు సబ్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి సంధ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి వసతి, బిందు సేద్యం ఉన్న రైతులు అయ్యే ఖర్చులో 40 శాతం సబ్సిడీగా ఇస్తారని, అందులో 60 శాతం మొదటి సంవత్సరం 40 శాతం రెండో సంవత్సరం బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారన్నారు. పండ్ల తోటలకు ఇచ్చే రాయితీలు కూడా ఆమె వివరించారు. హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు రూ.9600, బంతి, చామంతి, మల్లెతోటలకు ఎకరాకు రూ.8వేలు చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ రూములు, కోల్డ్ రూమ్, సోలార్ పవర్ కోల్డ్ రూమ్‌లో మొదలైన వాటికి 35 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు రైతులు దరఖాస్తు చేసుకోవడానికి పాసు పుస్తకంతో ఉద్యానశాఖ కార్యాలయాన్ని సోమ, గురువారాల్లో సంప్రదించాలని, వివరాలకు 7995009758 సెల్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం



ప్రసంగిస్తున్న శివసుబ్రహ్మణ్యశర్మ

ఒంగోలు కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ ఉద్బోధించారు. త్రేతాయుగంలో మానవ రూపంలో జన్మించి మనుషుడు అనుసరించాల్సిన ధర్మం, జీవన విధానాన్ని ఆచరణలో చూపిన శ్రీరామచంద్రుని జీవితాన్ని కలియుగంలో అందరూ పాటించాలని పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీలలితాశ్రమంలో ఆయన శ్రీరామవైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజీవితం సాఫల్యం కావడానికి ఇహపర సౌఖ్యాలు పొందటానికి శ్రీరాముని ఆరాధన, శ్రీరామనామ జపం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం శివసుబ్రహ్మణ్య శర్మను ఆశ్రమ నిర్వాహకురాలు మాతా విజ్ఞానందసరస్వతి సత్కరించారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): శీలంవారిపల్లి గ్రామానికి చెందిన టి.ఆశ అనే విద్యార్థిని తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఎంఎస్సీ ఎక్స్‌టెన్షన్ విభాగంలో విశ్వవిద్యాలయం స్థాయిలో ఉత్తమ మార్కులు పొందారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆశ బంగారుపతకం అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కరస్పాండెంట్ పార్థసారథి అభినందించారు.

పబ్లిక్ నోటీసు

చిత్తూరు జిల్లా, చిత్తూరు టౌన్, డోర్ నెం.14-387/2 నివాసి, **బిడుగు బ్రహ్మానందరావు గారి భార్య కోనేటి నిర్మలా కుమారి** గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా

నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ప్రకాశం జిల్లా, దావ గూడూరు నివాసి చెన్నారెడ్డి అంజయ్యగారి కుమారుడు చెన్నారెడ్డి పిచ్చిబాబు గారి ద్వారా ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దస్తావేజు నెం.**7042** ఆఫ్ 2025 ద్వారా కొనుగోలు జేసి సదరు దస్తావేజు లో జరిగిన పొరపాటు గురించి సవరణ దస్తావేజు వ్రాయించుకొని దస్తావేజు నెం. **7389** ఆఫ్ 2025 గా రిజిస్టర్ పొంది సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ ఉన్నారు. సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దస్తావేజు నెం.**3857** ఆఫ్ 1995 మరియు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ ప్లాన్ అండ్ ప్రొసీడింగ్స్ BA నెం.19/08/G1, ది. 06-10-2008 లను పోగొట్టుకున్నారనీ, సదరు విషయమై నా క్లయింటు ఒంగోలు తాలూకా పోలీసు వారికి ఫిర్యాదు ఇచ్చి ఉన్నారనీ, సదరు పోలీసు వారు సదరు పోయిన దస్తావేజు మరియు ప్లాను ప్రొసీడింగ్స్ దొరకలేదనీ 21-07-2025 తేదీన సర్టిఫికేట్ ఇచ్చియున్నారు. నా క్లయింటు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి కొనుగోలు నిమిత్తం **కెనరా బ్యాంక్, SME** బ్రాంచ్, ఒంగోలు వారి వద్ద ఋణ సౌకర్యము పొంది యున్నారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఉన్న యెడల లేదా సదరు పోయిన దస్తావేజులు దొరికిన యెడల లిఖిత పూర్వకముగా తగిన దస్తావేజులలో ఈ నోటీసు ప్రచురించిన **(15)** దినములలోపు ఈ క్రింది సంతకం దారులను సంప్రదించగలరు. లేని యెడల ఎవరికీ ఏ విధమైన అభ్యంతరములు గానీ, హక్కులు గానీ లేవనీ, సదరు పోయిన దస్తావేజులు దొరక లేదని భావించి మా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై లావాదేవీలు జరుపగలరు. గడువు తర్వాత వచ్చు అభ్యంతరములు నా క్లయింట్‌ను గానీ తదుపరి జరుగు లావాదేవీలను గానీ బద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన ఒంగోలు రూరల్ గ్రామ సర్వేనెం.270/1, తదుపరి సబ్ డివిజన్ కాబడిన ఒంగోలు రూరల్ గ్రామ సర్వేనెం.270/2, లోని ప్లాట్ నెం.39 లోని డోర్ నెం.7-980(23), అసెస్‌మెంట్ నెం.1035021953 గల RCC గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు స్థలమునకు **హద్దులు: తూర్పు:** P.వీరరాఘవులు గారి ప్లాట్ నెం.47,, **దక్షిణం:** దామచర్ల శ్రీధర్ బాబు గారి ప్లాట్ నెం.40, **పడమర :** 30 అడుగుల వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం:** కాట్రగడ్డ చంద్రమౌళి గారి స్థలము.

ఈ హద్దులలోని స్థలము 17 గదులు లేక 136.2/9 చ.గజముల లేక 113చ.మీ.ల స్థలము మరియు ఈ స్థలములోని RCC గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ సమస్త హక్కులతో సహా.

ఇట్లు: **చల్లా వెంకటప్పారెడ్డి, టి.చంద్రకళ**
న్యాయవాదులు, డోర్ నెం.46-139-63, 2వ లైన్,
క్రిష్ణా నగర్, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, సమతా నగర్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా, సెల్ :9848044909

ఒంగోలు
తేది.29.07.2025

కొప్పోలు రోడ్డులో డ్రైనేజీ పనుల ప్రారంభం

● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పులివెంకటరెడ్డికాలనీ జరుగుతున్న సైడుకాలువ నిర్మాణ పనులు

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పులివెంకటరెడ్డికాలనీ వద్ద తవ్వకాలు చేపట్టారు. అయితే ఈ సైడుకాలువల నిర్మాణం చేసేందుకు రోడ్డు ఆక్రమణలో ఉన్న కట్టడాలకు అధికారులు గతంలో నోటీసులు ఇచ్చారు. కేవలం 10అడుగులు మాత్రమే అక్రమ కట్టడాలను తొలగించారు. మొత్తం మీద 20 అడుగులు ఆక్రమణలు ఉండగా, ఆక్రమణదారులు ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుకుని పది అడుగులకు తగ్గించారు. ఈక్రమంలో సైడు కాలువల నిర్మాణాలకు రూ.2కోట్లు కేటాయించగా ఎట్టకేలకు పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

● కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విధుల్లో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ఇరువురు సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం నగరంలోని పేర్నమిట్ట, అన్నవరప్పాడు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో, అలాగే పేర్నమిట్ట వద్ద అంబేడ్కర్ కాలనీలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సమయంలో హౌసింగ్ బోర్డు కాలనీలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా అక్కడే తగలబెట్టడాన్ని గుర్తించిన కమిషనర్ ఏరియా శానిటరీ సెక్రటరీ, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నమిట్ట సచివాలయంలో సిబ్బంది హాజరుపట్టికలో సంతకం చేయకపోవడంతో పాటు ఫీల్డు పేరుతో మరికొందరు గైర్హాజరు కావడాన్ని గుర్తించిన కమిషనర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంపై వారిపై చర్యలు తీసుకోవాలని గుమస్తాకు ఆదేశించారు. అనంతరం పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల ఎన్ని ఉన్నాయి, ఎంతమందిని దత్తతకు గుర్తించారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు.

పేద విద్యార్థికి చేయూత

● స్కూలులో చేర్పించిన సంఘ సభ్యులు



మధులోకేష్‌ను స్కూలులో చేర్పిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు(రూరల్)/చీమకుర్తి, జూలై30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామానికి చెందిన పేద విద్యార్థి చల్లా మధులోకేష్‌కు కమ్మవారి సేవాసంఘం తరపున ఉచిత విద్యాసౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఒంగోలులోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధులోకేష్‌కు తల్లిదండ్రులు లేరని, ఆ కుటుంబ సభ్యులు పేదరికంతో చదివించటానికి ఎవరూ ముందుకు రాలేదని, దీంతో బంధువులు కమ్మవారి సేవా సంఘాన్ని ఆశ్రయించారని పేర్కొన్నారు. సంఘం సభ్యులు నిర్ణయం మేరకు ఆ విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చులు భరించటానికి అంగీకరించారు. 9వ తరగతి చదువుతున్న మధులోకేష్‌ను చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్‌లో చేర్పించారు. ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యం, పుస్తకాలు, దుస్తులు, ఇతర ఖర్చులు భరించటానికి తీర్మానించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అలా హనుమంతరావు, ఐకే డోనర్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు కరిచేటి చంద్రశేఖర్, అంగలకుర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు విరివిగా రుణాలు

● ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు



ఎస్‌బీఐ నూతన భవన భూమిపూజలో పాల్గొన్న ఆర్ఎం అప్పలరాజు

కొండపి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణకు ఎస్‌బీఐ విరివిగా రుణాలు అందిస్తున్నదని బ్యాంకు కందుకూరు ఆర్ఎం వి.అప్పలరాజు అన్నారు. బుధవారం కొండపిలోని టంగుటూరు రోడ్డులో బ్యాంకు నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొండపి ఎస్‌బీఐ (వ్యవసాయాభివృద్ధి శాఖ)లో 1,800 మంది రైతులకు పంట రుణాలు అందించామన్నారు 256 డ్వాక్రా గ్రూపుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు చేయూత నిస్తున్నదన్నారు. 'అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్' పథకంలో రైతులకు ట్రాక్టర్లు, అనుబంధ యంత్రాలు, డ్రోన్లకు రుణాలిస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం కార్యాలయ మేనేజర్ (హెచ్‌ఆర్) శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ బీఎం శరత్, పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వృద్ధాప్య తల్లిదండ్రులను జాగ్రత్తగా చూడాలి

● డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు సమాజానికి అనుభవ గనులని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, స్టేట్ రూల్స్-2011పై రీజనల్ రిసోర్స్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిడ్డలు తమ ఆస్తులను తీసుకున్నారే కానీ తమ పోషణ పట్టించుకోవడం లేదని ఇటీవల కాలంలో గ్రీవెన్స్‌లో పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సమాజంలో ఇలాంటి ధోరణి మంచిదికాదన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యతప్రతి ఒక్కరిపై ఉందని, వారి పోషణ, సంరక్షణ విస్మరించడం సరికాదన్నారు. చట్ట ప్రకారం అలా చేయడం శిక్షార్హమైన నేరమన్నారు. ఆయా చట్టాలపై జిల్లా అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రీజనల్ రిసోర్స్ శిక్షణ కేంద్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న రమేష్, భాస్కర్

చీమకుర్తి, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లామల్లి, చంద్రపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, ఏవో భాస్కర్‌లు పంటల బీమాపై రైతులు అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ పథకం, ఈకేవైసీ, ఎన్‌పీసీ తదితర అంశాలను వివరించారు. అనంతరం విత్తనాలను అందజేశారు.

జల వనరుల గణన చేపట్టాలి



మాట్లాడుతున్న ప్రసాద్

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సాగునీటి సౌకర్యాలను అందించటానికి మండలంలో ఉన్న జలశయాల గణన చేపట్టాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలాశయాలు, చిన్నతరహా నీటి వనరుల గణన ప్రతి ఐదు సంవత్సరాలకు కేంద్రం నిర్వహిస్తుందన్నారు. గ్రామంలో ఉన్న భూగర్భ జలవనరులు, జలాశయాల గణనను చేపట్టాలని వీఆర్వోలకు సూచించారు. దీని వల్ల ప్రభుత్వం సాగునీటికి సంబంధించిన కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సర్వేని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఏవో స్వర్ణలత మాట్లాడుతూ వీఆర్వోలను సమన్వయం చేసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులు ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో విజయలక్ష్మి, వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

2న ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు (రూరల్), జూలై30(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన ఒంగోలులో ధర్నా నిర్వహిస్తున్న ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ సమస్యలు పరిష్కరించుకోవటానికి ఈ ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. డీఏ బకాయిలు, పీఆర్సీలు పొందటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘనాయకులు తరలిరావాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే వేయాలన్నారు. 30శాతం ఐఆర్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య, రఫీ, వై.వెంకట్రావు, అబ్దుల్ హై, డి.శ్రీనివాసులు, బి.వెంకట్రావు, వై.వెంకట్రావు, చల్లా శ్రీనివాసులు, పి.వెంకట్రావు, పి.సుబ్బారావు, చిన్నస్వామి తదతరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు జాతి పశువుల వేలం

● రూ.9.24 లక్షల ఆదాయం



పశువుల వేలం నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చదలవాడ పశు క్షేత్రంలోని 46 ఒంగోలు జాతి పశువులకు బుధవారం నిర్వహించిన వేలం ద్వారా రూ.9,24,000 ఆదాయం వచ్చినట్లు క్షేత్ర డీడీ డాక్టర్ బి.రవికుమార్ తెలిపారు. ఒట్టి ఆవులు 12, పెయ్యలు 2, పెయ్యదూడలు 16, కోడె దూడలు 16కు చదలవాడ పశు క్షేత్రంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతా నుంచి రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోనూరి రాధ, ఏడీఏలు శ్రీనివాసరావు, బసవశంకరరావు పాల్గొన్నారు.

ఇంగ్లీషు మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న చంద్రశేఖర్

కొండపి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదకండ్లగుంట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అదే స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తంగెళ్ల చంద్రశేఖర్ ఇంగ్లీషు మెటీరియల్‌ను బుధవారం ఉచితంగా అందజేశారు. ఆయన్ను హెచ్‌ఎం పఠాన్‌ఖాన్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంగోలులో యువకుడు ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం సుజాతనగర్ ఒకటో లైనులో దుద్దుకూరు బాలకృష్ణ(36) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు బాలకృష్ణ బేల్దారి పనులకు వెళుతుంటాడు. ఇటీవల ఆయన హైదరాబాద్ వెళ్లి పది రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో సాయంత్రం భార్య, కుమారుడు బయటకు వెళ్లగానే బాలకృష్ణ వరండాలో చీరతో ఉరేసుకుని చనిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి షరీఫ్

ఒంగోలు విద్య, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా అనేది వ్యవస్థీకరణ నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ షరీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా అనేది నేరమన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి మాట్లాడుతూ పిల్లలు ప్రలోభాలకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఇందిర, బి.శ్రావణి, శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక స్మారక చిహ్నాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక స్మారక చిహ్నాలు, ప్రదేశాల పునరుద్ధరణపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ దేశంలో భారత పురావస్తు సర్వే సంస్థ పరిధిలో రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు 3,685 ఉన్నాయన్నారు. నిర్ణీత సమయాలలో ఈ సంస్థ తనిఖీలు నిర్వహించి ప్రస్తుత అవసరాన్ని బట్టి వాటి పరిరక్షణకు, నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 2020-21లో రూ.4.57కోట్లు, 2021-22లో రూ.5.75 కోట్లు, 2023-24లో రూ.14.70కోట్లు, 2024-25లో రూ.6.50 కోట్లు కేటాయించి ఖర్చుచేసినట్లు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత 15 రోజుల నుంచి భూములు దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యాయి. అప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం రాత్రి మద్దిపాడు మండలంలో 6 సెం.మీ వర్షం కురిసింది. ప్రధానంగా మిరప, పత్తి, జొన్న, జనుము, మినుము, పిల్లిపెసర సాగుకు రైతులు సమాయాత్తమవుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

టంగుటూరు (కొండపి), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని, కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి సువర్ణ సూచించారు. కిశోర వికాసంలో భాగంగా కొణిజేడు హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల రక్షణకు అనేక చట్టాలున్నాయని అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం అధికారి లక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం చల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

4నుంచి నంద్యాలలో శిక్షణ తరగతులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్ తదితరులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 6వతేదీ వరకు నంద్యాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విజ్ఞాన, వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని గత 50 ఏళ్ళ నుంచి పీడీఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిసింద్రీబాబు, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, సచిన్, యూనివర్శిటీ నాయకుడు హరిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వల్ల ఆరోగ్యానికి అనర్థం

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పొగాకు వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన అనర్థం ఉంటుందని స్టేట్ ఫార్మసిస్ట్ సంఘం నాయకుడు ఎంపీ.రత్నకుమార్ పేర్కొన్నారు. బుధవారం బసవన్నపాలెంలోని పొగాకు కంపెనీల వద్ద కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు వల్ల లంగ్స్ దెబ్బతింటాయని, కూలీలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి


పవన్ మృతదేహం

కంభం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతూ అదుపుతప్పి కిందపడిన సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం... మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామానికి చెందిన నాగెళ్ల పవన్(25) కంభం నుంచి స్వగ్రామమైన పెద్దనల్లకాల్వకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చిన్నకంభం సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న కిలోమీటరు రాయికి బలంగా ఢీకొనడంతో పవన్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రమబద్ధీకరణను ఉపయోగించుకోవాలి

గిద్దలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఒక ప్రకటనలో కోరారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు నిర్ణీత అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని, ఈ అవకాశం అక్టోబరు 24వ తేదీలోపు వరకే ఉందని, వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

వరికపూడిశెల ఎత్తిపోతల పనుల్లో కదలిక

అటవీశాఖకు రూ.14.5 కోట్లు చెల్లించిన ప్రభుత్వం

తొలిదశ పనుల ప్రారంభానికి తొలగిన అడ్డంకి


వరికపూడిశెల ఎత్తిపోతల ప్రారంభమయ్యే స్థలం

త్రిపురాంతకం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వరికపూడిశెల ఎత్తిపోతల పథక పనులకు ఉన్న అడ్డంకులు తొలగిపోతున్నాయి. పల్నాడు జిల్లా రైతుల దశాబ్దాల కలయైన ఈ ప్రాజెక్ట్ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలరైతులకు వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోని తీగలేరు-5 కాలువ తరువాత పల్నాడు జిల్లాలో నిర్మితమవుతున్న ఈ వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ప్రధానమైనది.

నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌ను వెల్దుర్తి మండలం గంగలకుంట వద్ద ఎత్తిపోతల పథకాన్ని రెండు దశల్లో పూర్తిచేయనున్నారు. మొదటి దశలో పల్నాడు జిల్లాలోని మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలకు నీరిచ్చేలా- రెండో దశలో పనులు చేపట్టి పుల్లలచెరువు మండలంలోని కొన్ని గ్రామాలకు సాగు, తాగు నీరు ఇచ్చేలా పథకం రూపకల్పన చేశారు. ఈ పథకాన్ని ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావుడిగా శంకుస్థాపన చేసింది. అంతకుమించి రూపాయి ఇవ్వలేదు. పనులు అడుగు ముందకు పడలేదు.

యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు...

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ప్రాజెక్ట్ కోసం నీళ్ల ప్రారంభమయ్యే ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతం పరిధిలో ఉండగా అటవీశాఖ అనుమతులు అవసరమయ్యాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి రెండు రోజుల క్రితం అటవీశాఖకు 14.5కోట్ల రూపాయలను చెల్లించటంతో అడ్డంకి తొలగిపోయింది. ముఖ్యంగా మంత్రి లోకేష్ యువగళం పాదయాత్రలో పల్నాడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామన్నారు. ఆ మేరకు అధికార యంత్రాంగం పనులు చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

రెండోదశ పనులతో పుల్లలచెరువు రైతులకు లబ్ధి

ప్రాజెక్ట్ పనులు ప్రారంభమైతే రెండో విడత పనులు పూర్తి ద్వారా పుల్లలచెరువు మండలంలోని 10,456 ఎకరాలకు సాగునీరు అందనుంది. అంతేకాకుండా మూడు గ్రామపంచాయతీల్లోని 14 చెరువులను నింపటం ద్వారా తాగునీటి ఇబ్బందులు కూడా తొలగేలా రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా మర్రివేముల గ్రామంలో 2,476.74 ఎకరాలు, శతకోడులో 1,338.36 ఎకరాలు, ముటుకుల గ్రామంలో 6,641.96 ఎకరాలకు సాగునీరు అందనుంది. పలుగ్రామాల రైతులు వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోని తీగలేరు-5 కాలువ ద్వారా జరిగే మేలు కోసం ఎదురు చూసినట్టే ఈ గ్రామాల రైతులు కూడా వరికపూడిశెల ప్రాజెక్ట్ కోసం ఆశతో ఉన్నారు. ఇప్పుడు తొలిదశ పనులు ప్రారంభమవుతున్నాయన్న సమాచారంతో ఈ ప్రాంత రైతుల ఆశలు చిగురించాయి.

రైతులకు పంట పిచికారీ డ్రోన్ ఎంతో మేలు

రైతులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందుల

ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలు, ప్రభుత్వ సబ్సిడీ రూ.7.80 లక్షలు


దరిమడుగు గ్రామంలో డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పంట పిచికారీ డ్రోన్ ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చెప్పారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో బుధవారం ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన పంట పిచికారీ డ్రోన్‌ను వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ పంటలకు పురుగుమందులు పిచికారీ సులభంగా, అతి తక్కువ సమయంలో చేసుకోవచ్చన్నారు. డ్రోన్ ద్వారా రోజుకు 25 నుంచి 30 ఎకరాల వరకు మందులను పిచికారీ చేయవచ్చునని చెప్పారు. డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు కాగా, ప్రభుత్వ రాయితీ రూ.7.80 లక్షలు ఉందని, రైతు వాటాగా రెండు లక్షల రూపాయలు చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, ఏవో బుజ్జిబాయి, హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

రాయితీ కూరగాయల విత్తనాల పంపిణీ

ప్రభుత్వం రాయతీపై అందిస్తున్న కూరగాయల విత్తనాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో డ్వాక్రా మహిళలకు రాయితీ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పిచ్చయ్య, సీసీ నాగయ్య పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

విద్యార్థులతో ముఖాముఖిలో ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాల కోసం నిరంతరం శ్రమించాలని టీడీపీ ఎర్రగొండపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. మండలంలోని ఓబులక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే లక్ష్యాలను సాధిస్తారన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీటి వసతి, గ్రంథాలయం, పాఠశాలకు రోడ్డును మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శింగంపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని ఓబులక్కపల్లిలో తీగలేరుపై చెక్‌డ్యాం నిర్మాణానికి బుధవారం టీడీపీ ఎర్రగొండపాలెం ఇనార్చి గూడూరి ఎరిక్షన్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రైతులకు అండగా ఉండేందుకు కోటి రూపాయలతో చెక్‌డ్యాం నిర్మాణానికి నామ్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. చెక్‌డ్యాం నిర్మాణంతో నీటి నిల్వకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు తప్పక అమలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఎన్నికల హామీలకు తూచ తప్పక అమలు చేస్తోందని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. మండలంలోని మల్లవరంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి తొలి ఏడాది ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ల పంపిణీ, అన్నా కాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలను అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు. నాడు గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పరిస్థితి నుంచి నేడు సుఖంగా వెళ్లే పరిస్థితికి ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసుల రెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పథకానికి నేడు చివరి రోజు

తర్లుపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పంటలకు ఫసల్ బీమా పథకానికి జూలై 31వ తేదీ చివరి తేదీ అని వ్యవసాయాధికారి జ్యోత్స్నాదేవి చెప్పారు. మండలంలోని పోతలపాడు, కందలపల్లిలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో దేవేంద్రగౌడ్, వెటర్నరీ అసిస్టెంట్ గురవయ్య, రైతులు పాల్గొన్నారు.

కందులు, మినుములు పంపిణీ

జాతీయ గ్రామీణ విత్తనోత్పత్తి కింద రైతులకు ఉచితంగా కందులు, మినుములు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జోత్స్నదేవి తెలిపారు. ప్రతి సచివాలయానికి 45(ఒక్కొక్క కిట్టు 4 కేజీలు) కిట్లు కందులు, 10 కిట్లు మినుములు వచ్చినట్లు వీటిని చెప్పారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు

రాచర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటల సాగుకు మొగ్గు చూపాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి వీవీ శేషమ్మ చెప్పారు. మండలంలోని యడవల్లి గ్రామంలో ఏవో మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీఏఏ నందిని పాల్గొన్నారు.

పంటల బీమా వినియోగించుకోండి

త్రిపురాంతకం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోవాలని ఏవో సంగమేశ్వరరెడ్డి చెప్పారు. మిరియంపల్లి, కంకణాలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సహాయకులు బ్రహ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఫసల్ బీమాతో రైతులకు ఉపయోగం

ఎర్రగొండపాలెం రూరల్, జులై 30 (ఆంధ్రజ్యోతి): సాగు చేసిన వరి, కంది, మిరప, నువ్వు, జొన్న, మినుముతోపాటు పత్తి పంటలకు ఫసల్ బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో నీరజ చెప్పారు. అమానిగుడిపాడు, వాదంపల్లి గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో పొట్టయ్య, దినేశ్వరనాయక్ పాల్గొన్నారు.

పీ 4 మార్గదర్శికి సన్మానం

అవీఇవీ


మార్గదర్శిని సన్మానిస్తున్న కమిషనర్ రమణబాబు

గిద్దలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మేకల శంకరయ్యను మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ 4 కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లికి చెందిన కామిరెడ్డి రమాదేవి కుమార్తె విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శిశంకరయ్యను కమిషనర్ రమణబాబు సన్మానించారు. శంకరయ్యను ఆదర్శంగా తీసుకుని దాతలు ముందుకు రావాలని కమిషనర్ కోరారు.

7న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన


మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణారావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఒంగోలులో జరిగే శోభయాత్ర బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరసనగండ్ల శ్రీనివాసులు, షబానా, అశోక్ రెడ్డి, మద్దెల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


ప్రసంగిస్తున్న నాయకులు

గిద్దలూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియచెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ చెప్పారు. గిద్దలూరులో పోలింగ్‌బూత్‌ల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీన ఒంగోలు వస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు కంచర్ల ప్రదీప్‌కుమార్‌గౌడ్, కె.వి.చంద్రమోహన్, గుమ్మా రాముడు, శ్వేత, బి.వి.రామాంజనేయులు, ఎ.శేఖర్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు 6,565 మంది అర్హులు


రైతులతో మాట్లాడుతున్న ఏవో లక్ష్మీనారాయణ

పెద్దారవీడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలో 6,565 మంది రైతులు అర్హులని ఏవో లక్ష్మీనారాయణ చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లిలో గ్రామసభలతోపాటు క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఏడుగురు రైతులు ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. మరో 199 మంది రైతులు బ్యాంకులలో ఎన్‌పీసీఐ చేయించుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకురాళ్లు లావణ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలు సకాలంలో అందించండి

రాచర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాలు సకాలంలో అందించి వారి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కత్తి అనోజీ రావు చెప్పారు. కమిటీ సభ్యుడిగా ఎంపికైన సందర్భంగా బుధవారం ఆయన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్‌ను ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి కార్పొరేషన్ సంపూర్ణ సహకారం అందించాలని, సకాలంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల సభ్యులు కోలా ప్రసన్న, దున్న యేబు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఎర్రగొండపాలెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సైకాలజిస్టు లావణ్య చెప్పారు. ఎర్రగొండపాలెం కస్తూరిబాగాంధీ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులు, 10వ తరగతి విద్యార్థినులకు నిజ జీవితంలో ఎలా ఎండాలనే విషయంపై సైకాలజిస్టు లావణ్య బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి వ్యక్తులతో స్నేహం పెంచుకోవాలని, చెడు వ్యక్తులకు దూరం పాటించాలని చెప్పారు. కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానాలు అధిరోహిస్తారన్నారు

ఘనంగా కాశీవిశ్వేశ్వర స్వామి వార్షికోత్సవం

ముండ్లమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ గంగా అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి 16వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి, పార్వతిదేవి, వినాయక స్వామి, నాగేంద్రుడు, ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. భారీగా అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

కురిచేడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ముగ్గురు దివ్యాంగ విద్యార్థులకు బుధవారం మండల విద్యాశాఖాధికారులు ఉపకరణాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో వస్రాం నాయక్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదన్నారు. ఎంఈవో-2 సుబ్బారావు మాట్లాడుతూ విదేశీ వ్యక్తి నిక్ రెండు కాళ్ళు, చేతులు లేకపోయినా దేశదేశాలు తిరిగి ఎందరినో ఉత్తేజితులను చేశారన్నారు. అనంతరం ముగ్గురు విద్యాంగులకు వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు అంకారావు, రీసోర్సు ఉపాధ్యాయులు గురువార్ధన్‌రావు, సురేష్, ప్రధానోపాధ్యాయుడు విజయారావు, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

పామూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవులు అక్రమ రవాణాను అరికట్టడానికి సమిష్టి కృషి చేయాలని ఎంఈవో కె.కరుణకుమారి అన్నారు. ప్రపంచమానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలి

పామూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి తమ వంతుగా సహాయపడటమే మానవతా సంస్థ లక్ష్యమని ఆసంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి అన్నారు. బుధవారం సభ్యత్వాల నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎం.నారాయణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటిని అమలుచేస్తున్నాం!

- మంత్రి డాక్టర్ స్వామి
- 2న తూర్పువీరాయపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటన
- అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం
- ఏర్పాట్లకు స్థలాల పరిశీలన


సీఎం పర్యటన ఏర్పాట్లపై తూర్పువీరాయపాలెంలో చర్చిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం క్రమంతప్పకుండా అమలుచేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమల్లోభాగంగా ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకాన్ని తూర్పువీరాయపాలెంలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

సీఎం పర్యటన ఖరారుకావడంతో తొలుత అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు బుధవారం పలు గ్రామాల్లో పరిశీలన చేశారు. తొలుత మండలంలోని తూర్పువీరాయపాలెంలో ఒక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దర్శి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపాలెం సమీపంలో మరో స్థలాన్ని చూశారు. తదనంతరం శివరాజ్‌నగర్ వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడే మరొక స్థలాన్ని సీఎం ప్రోగ్రాంకు పరిశీలించారు. ఆతర్వాత మండలంలోని రాజంపల్లి వద్ద రెండు స్థలాలను చూశారు. అక్కడినుంచి తిరిగి తూర్పువీరాయపాలెంలో తొలుత చూసిన స్థలాలతో పాటు మరొక స్థలాన్ని పరిశీలన చేశారు. పరిశీలించిన స్థలాలపై అధికారులు చర్చించి ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాన్ని నిర్ణయిస్తారు.

ఈసందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు రావటం ఆనందదాయకమన్నారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని సీఎం చంద్రబాబు దర్శిలో ప్రారంభిస్తారని చెప్పారు. అదేనెల 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నట్టు చెప్పారు. దీంతో సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు పూర్తిగా అమలుచేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆయన పర్యటనకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు తూర్పువీరాయపాలెం, దర్శి మున్సిపాలిటీలోని శివరాజ్‌నగర్, రాజంపల్లి గ్రామాల్లో పర్యటించామ న్నారు. అన్నిచోట్ల పరిశీలించిన తర్వాత తూర్పువీరాయపాలంలో సీఎం పర్యటనను ఖరారు చేసినట్టు చెప్పారు.

కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగవేణి, సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



దొనకొండలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెట్రోల్, డీజల్ నాణ్యతను, లీటర్లలో కొలతను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులతో పాటు బంక్‌లో ఏర్పాటుచేసిన టాయిలెట్స్, మంచినీరు, గాలి పంపు తదితర సౌకర్యాలను తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. తదనంతరం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం అదనంగా కావల్సిన భూమిని పరిశీలించేందుకు మండలంలోని భూమనపల్లి, మల్లంపేట, మంగినపూడి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను సందర్శంచారు. ఆయన వెంట తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురంలో నూతనంగా నిర్మించిన జియో పెట్రోల్ బంకుకు అనుమతి ఇచ్చేందుకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న బుధవారం పరిశీలించారు. త్వరలో ప్రారంభించే పెట్రోల్ బంకులో వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, వీఆర్వో సుజాత తదితరులు ఉన్నారు.

తాళ్లూరు: తాళ్లూరులోని పెట్రోల్ బంక్, రేషన్ దుకాణాలను తహసీల్దార్ బీవీ రమణారావు బుధవారం ఆకస్మికంగాతనిఖీ చేశారు. ఫిల్లింగ్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రజానగరంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు


కనిగిరి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డీఎం వరలక్ష్మి

కనిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ సరుకుల సరఫరాలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి, పామూరు ప్రాంతాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. వాటి సరఫరాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత గోడౌన్ డీటీపై ఉందన్నారు. గోడౌన్‌లోని సరకుల వివరాలు, సరఫరా చేసే వాటిపై తహసీల్దార్ పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి


సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ జైనులాబ్దిన్

కనిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు వివిధ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జ్ ఏడీఏ జైనులాబ్దిన్ అన్నారు. బుధవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్గించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చేలా పంటల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు వివిధ రకాల సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమతం వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి డాక్టర్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెలుగువారిపాలెం పాఠశాల తనిఖీ

తాళ్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల(ఏఏ)ను ఎంఈవో జి.సుబ్బయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు.

కార్యక్రమంలో హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు పి.మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం


పెద్ద మసీదు వెనుక రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

పామూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రోడ్డు వేస్తున్నారంటే మొదట ఆమార్గంలో అడ్డంగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు తొలగించి నిర్మాణపనులు చేపడుతారు. అయితే, పామూరు పట్టణంలోని విరువూరు రోడ్డులో గల పెద్ద మసీదు వెనుక బజారులో విద్యుత్ స్తంభం తొలగించకుండానే సిమెంటు రోడ్డు వేశారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో ఆటోలు, ట్రాక్టర్, గ్యాస్ సిలెండర్ వాహనాలు రావాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయసేవాధికార సంస్థ, గుడ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పామూరు బస్టాండు సెంటరులో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా సవాలుగా మారిందన్నారు. అక్రమ రవాణాను అరికట్టి మానవ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆడపిల్లల అక్రమ రవాణా, మహిళలు, ఆడపిల్లలు తప్పిపోతున్న ఘటనలు చోటు చేసుచేసుకోవటం ఆందోళన కల్గిస్తుందన్నారు. ప్రభుత్వం శక్తియాప్ రూపొందించి మహిళలకు అండగా నిలిచిందన్నారు. ప్రతి మహిళా తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో శక్తియాప్‌ను పొందుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎస్‌వో పీవీ రమణారెడ్డి, ఏఎస్ఐ భాస్కర్‌రావు, రమేష్ బాబు, నవకుమార్, ఎలీషా, పవన్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కమలాకర్

విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలి

ముండ్లమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. చెడు అలవాట్లకు గురికాకుండా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. బుధవారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెనూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

తాళ్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని టీడీపీ నేతలు కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాచకొండ వెంకటరావు బుధవారం తహసీల్దార్ బీవీ రమణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాదిగా తరుచుగా తహసీల్దార్లు మారుతుండటంతో ప్రజలకు సేవలు సక్రమంగా అందలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దార్ రమణరావు మాట్లాడుతూ గతంలోవలె కాకుండా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు నిర్భయంగా కార్యాలయానికి వచ్చి సేవలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో చెన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుధాయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం



ఉమామహేశ్వర అగ్రహారంలో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

ముండ్లమూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని దర్శి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు సాగుచేసిన మొక్క జొన్న పైరును పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి పంటకు ఇన్సూరెన్స్ చేయించు కోవాలన్నారు. తద్వార ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం వర్తిస్తుందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని పంటలు సాగు చేసినట్లయితే ఎంతోమేలు జరుగుతుందన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడి నష్టపోవద్దన్నారు. ఈసందర్భంగా రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, వీఏఏలు అఫ్రీన్, శ్రీదేవి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

భూమి రికార్డు మాయం

ముండ్లమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం గ్రామానికి సంబంధించిన మాన్యువల్ 1బీ రికార్డు మాయమైంది. వీఆర్వో దగ్గర, తహసీల్దార్ కార్యాలయంలో ఉండాల్సిన 1బీ మాయమవ్వటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తన భూమికి సంబంధించిన 1బీ కాపీలు తీసుకోవాలంటే రికార్డులు లేక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన మేడికొండ కృష్ణారావు ఇటీవల 2019కి సంబంధించిన మాన్యువల్ 1బీ రికార్డు కోరారు. ఇది శంకరాపురంలో గాని, తహసీల్దార్ కార్యాలయంలోగాని లేకపోవటంతో తమకు అన్యాయం జరుగుతుందని దర్శి సివిల్ కోర్టులో కేసు వేశారు. హైకోర్టులో కూడా కేసు వేయటంతో హైకోర్టు 2019 నుంచి పనిచేసిన అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పటి అధికారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు వచ్చాయి. అప్పట్లో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్‌వోలపై చర్యలకు సిద్ధమైనట్టు సమాచారం.

కార్యకర్తలకు అండగా ఉంటా!


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

కురిచేడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తించుకుంటానని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత తగిన స్థానం కల్పిస్తామన్నారు. బుధవారం స్థానిక కల్యాణ మండపంలో జరిగిన వైసీపీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివప్రసారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలన్నారు. తాను కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం

సీఎస్‌పురం(పామూరు), జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో గల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ చేసిన టి.ఆశ అనే విద్యార్థిని బంగారు పతకం సాధించింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఎంఎస్సీ ఎక్స్‌టెన్షన్ విభాగంలో అడ్మిషన్ పొంది అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విశ్వవిద్యాలయం స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది.

ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. గోల్డ్ మెడల్ సాధించిన సాధించిన విద్యార్థిని ఆశను కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కరస్పాండెంట్ పార్థసారథి, డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, అధ్యాపకులు అభినందించారు.

రాజకీయాలకతీతంగా 'సంక్షేమం'

పామూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం సంక్షేమం పథకాలను అందజేస్తుందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలిఏడాది కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధమూర్తి మల్లికార్జునరెడ్డి, అమ్ములూరి రవి, గాజులపల్లి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని వగ్గంపల్లి, రావిగుంటపల్లి, గ్రామాలతో పాటు పట్టణంలోని 267, 278, బూత్ పరిధిలో జరిగిన కార్యక్రమాల్లో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమాల్లో చావా సుబ్బారావు, బైనెడ్డి వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ హజీగౌస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం మండలం పెద్దరాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయిళ్ల నారాయణరెడ్డి, మన్నేపల్లి శ్రీనివాసులు, పోకల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



పెనుమూడి వద్ద వరద ప్రవాహం

బిరబిరా.. కృష్ణమ్మ

బిరబిరా పరుగులతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో.. శ్రీశైలం నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలతో పాటు ప్రకాశం బ్యారేజీ నిండుకుండల్లా మారాయి. సాగర్‌కు భారీగా వరదతో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. లక్షల క్యూసెక్కులు సముద్రం దిశగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణమ్మ సోయగాలతో కనువిందు చేస్తుండగా దిగువున వరద భయంతో ప్రజలను వణికి స్తోంది. నదీ తీరం వెంట గంటగంటకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జూలై నెలలో కృష్ణానదిలో నీటి ప్రవాహం ఉంది. పైగా నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు జలాశయాలు నిండుకుండల్లా మారడం.. భారీగా వరద నీటి విడుదలతో పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేపట్టారు. అయితే డెల్టా పరిధిలోని లంక గ్రామాల్లోని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.



భట్టిప్రోలు : పెదలంక అరటి తోట




చింతల్లంక వద్ద కళకళలాడుతున్న కంద పైరు

- జలాశయాల గేట్ల నుంచి జాలువారుతూ..
- ఒకవైపు కనువిందు.. మరోవైపు వరద భయం
- సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్లు ఎత్తి విడుదల
- ఇన్‌ఫ్లో 3,01,350 క్యూసెక్కులు.. ఔట్‌ఫ్లో 2,54,668 క్యూసెక్కులు
- వరద హెచ్చరికతో భయాందోళనల్లో లంక గ్రామాల రైతులు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,82,364 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బుధవారం అధికారులు 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,65,816 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 7272, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 3,12,158 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.20 అడుగులు ఉంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 2,82,364 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బ్యారేజీకి పెరిగిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు

ప్రకాశం బ్యారేజ్ వద్ద గంట గంటకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు పెరుగుతున్నా యి. బుధవారం రాత్రి 9.30 గం టలకు 1,21,679 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజ్ వద్దకు చేరుతున్నట్లు ఇరిగేషన్‌వర్గాలు గుర్తించాయి. బ్యారేజ్‌లో నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతున్నది. 60 గేట్లను రెండు అడుగులు, 10 గేట్లను మూడు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 10,207, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 6,522, గుంటూరు ఛానల్‌కు 200, సముద్రంలోకి 1,04,750,750 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు గురువారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.



అప్రమత్తం.. హెచ్చరికలు

ఎగువ నుంచి పెద్దఎత్తున నీటి ప్రవాహంతో నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. గజఈత గాళ్లను సిద్ధం చేశారు. పశువులను నదిలోకి దింప వద్దని రెవెన్యూ శాఖ హెచ్చరించింది. పడవలను కూడా నిషేధించారు. అవసరమైన ప్రాంతాల్లో నది వెంట పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహంపై తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



వరద ముప్పుపై డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రామలక్ష్మి

కొల్లూరు, రేపల్లె, గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉరుకులు పరుగులతో సాగరం దిశగా ప్రవ హిస్తోంది. నిండుకున్న జలాశయాల నుంచి నీటి విడుదలతో ప్రకృతి ప్రేమికులకు కను విందు చేస్తూ పరవళ్లు తొక్కుతోంది. నాగా ర్జున సాగర్, టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిల నుంచి భారీగా వరద ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ అధికారులు ఇన్‌ఫ్లోను అంచనా వేసి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద పోటెత్తుతుండటంతో మంగళవారం సాయంత్రం నుంచే అన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలు చేస్తున్నారు. దీంతో భారీగా వస్తోన్న వరదను టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల వద్ద కూడా అన్ని గేట్లు ఎత్తి దిగువకు పంపుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనట్లుగా కృష్ణమ్మ ప్రవాహం ముందుకు సాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌లో 586.20 అడుగుల మేర నీటి మట్టం ఉండగా ఇది 301.36 టీఎంసీలకు సమానం.

బుగ్గవాగు నుంచి నీటి విడుదల

జవహర్ కుడికాల్వ జలకళ సంతరించుకుంది. బుగ్గవాగు నుంచి కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఎస్‌సీ కృష్ణమోహన్ తెలిపారు. బుగ్గవాగు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.46 టీఎంసీలు కాగా 2.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. కుడి కాల్వ నుంచి గుంటూరు, అద్దంకి, బెల్లంకొండ, జూలకల్లు బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేశారు.

నిండు కుండలా పులిచింతల

వరద పోటేత్తుతుండటంతో పులిచింతల జలాశయం జలకళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. డ్యాం సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను నీటి నిల్వ 41.34 టీఎంసీలకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.08 అడుగులకు చేరింది. గరిష్టస్థాయికి నీటి మట్టం చేరడంతో డ్యాంలోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేసేందుకు (మిగతా 6వ పేజీలో)



పోతార్లంక వద్ద వేసిన పసుపు పైరు

పొగాకు కొనుగోలులో
ప్రమాణాలను పాటించాలి

వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సునీత

బాపట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత సూచించారు. బాపట్ల, చీరాల, పర్చూరు మండలాలలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన నల్ల బర్లీ కొనుగోలు కేంద్రాలు, గోదాములలో నిల్వ చేసిన పొగాకును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న పొగాకును భద్రంగా నిల్వ చేయాలని తెలిపారు. రైతులు నుంచి పొగాకు కొనుగోలు చేసే సమయంలో అధికారులు తేమశాతాన్ని ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో ఉన్న గోదాములు నిండితే ఇక్కడ ఉన్న పొగాకును పొరుగు జిల్లాల్లోని గోదాములకు తరలించాలన్నారు. ముందస్తుగానే గోదాములను ఎంపిక చేసుకొని వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ, జిల్లా మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్‌బాబు పర్యటనలో పాల్గొన్నారు.



బాపట్ల మార్కెట్‌యార్డులోని గోదాములను పరిశీలిస్తున్న వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సునీత

కోరుపై కన్నెర్ర

ఫ్యాక్టరీలో కార్యకలాపాలను అడ్డుకున్నగ్రామస్థులు

మేదరమెట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) ఇరవై రోజులు సమయం తీసుకున్నారు.. కోరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.. అయినా చెప్పినట్లుగా చేయకపోవడంపై మేదరమెట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం సింథైట్ ఫ్యాక్టరీ(మిరపకాయల) వద్దకు వచ్చి కార్యకలాపాలను అడ్డుకున్నారు. కోరు ఆగలేదని, అనేక ఇబ్బందులు పడుతున్నామని ఫ్యాక్టరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని నడపడానికి లేదని అక్కడే టెంట్ వేసుకుని కూర్చున్నారు. ఈసందర్భంగా ఫ్యాక్టరీ అధికారులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నడిపితేనే కోరు నివారణ యంత్రాలను బిగించడానికి వీలవుతుంది, మరికొంత సమయం ఇవ్వాలని గ్రామస్థులను కోరారు. కొత్తగా వచ్చిన అధికారులు పబ్బం గడుపుకుని వెళ్లిపోతున్నారనే కానీ కోరు మాత్రం ఆగడంలేదని గ్రామస్థులు తెలిపారు. కోరు రాకుండా ఉన్నప్పుడే ఫ్యాక్టరీని నడపాలని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు(పంతులుశ్రీను), మద్దాలి సంజీవరావు, చావా హనుమంతరావు, కర్నాటి సుబ్రహ్మణ్యం, వేగూరి శేఖర్, మద్దాళి రాఘవ, ఆదూరి ప్రసాద్, రవ్వవరపు బ్రహ్మయ్య, చావా రాజేష్, శ్రీదర్, ఓగూరి హరిబాబు, వెంకట్రావు, బోయపాటి శంకర్, కర్నాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సింథైట్ ఫ్యాక్టరీ అధికారులతో మాట్లాడుతున్న మేదరమెట్ల గ్రామస్థులు

ఏడాదైనా.. ఎక్కడివక్కడే!

- అటు సదస్సులు.... ఇటు కుప్పలుగా రెవెన్యూ అర్జీలు
- ఏడాది పాలన దాటినా కొలిక్కిరాని రెవెన్యూ సమస్యలు
- పీజీఆర్ఎస్‌లో ఇప్పటికీ 70 శాతం భూ సంబంధిత అర్జీలే
- ఆరు నెలల వ్యవధిలో 3,478 వినతులు
- గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చినవి అదనం
- నత్తనడకన సాగుతున్న రీసర్వే అంకం
- అర్జీల పరిష్కారంలో జిల్లాకు 19వస్థానం
- అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

ఐదేళ్ల వైసీపీ పాలనలో భూసంబంధిత వివాదాలు అనేకం... కొన్ని యజమానుల మధ్య వివాదాలు అయితే, మరికొన్ని ఆపార్టీ నేతల ధనదాహం వల్ల వివాదంగా మారినవి. అధికారాన్ని ఉపయోగించి రికార్డులను తారుమారు చేసి మరీ పలు చోట్ల భూములను కైంకర్యం చేసిన ఘనత గత పాలకులది. ఇలా రెవెన్యూకు సంబంధించి అనేక అక్రమాలకు పాల్పడడంతో వేల సంఖ్యలో బాధితులు తయారయ్యారు. గత ప్రభుత్వ హయాంలోనే అనేక మంది భూ బాధితులు పలు వేదికలపై తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ అర్జీలు అందించారు. ఈ ప్రభుత్వం కొలువుదీరగానే రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించిన సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా గ్రామసభల నిర్వహణతో పాటు రెవెన్యూ సదస్సులను పెద్ద ఎత్తున జరిపి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించింది. ఈ రెండు వేదికలమీద నుంచే జిల్లా వ్యాప్తంగా దాదాపు 5,600 భూ సంబంధమైన వినతులు ప్రజల నుంచి వచ్చాయి. ఇవి కాకుండా ప్రతిసోమవారం కలెక్టరేట్ వేదికగా నిర్వహించే పీజీఆర్ఎస్(ప్రజాసమస్యల పరిష్కార వేదిక)లో వచ్చినవి అదనం. దాదాపు ఏడాది కాలం నుంచి రెవెన్యూ యంత్రాంగం మొత్తాన్ని ఈ సమస్యల పరిష్కారం మీదే ప్రభుత్వం మొహరించింది. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు సగటున 200 అర్జీలు వస్తే వీటిలో 150 వరకు రెవెన్యూవే ఉండడం గమనార్హం.



కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు పెద్ద సంఖ్యలో వస్తున్న రెవెన్యూ బాధితులు (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సభలు, సదస్సులతో పాటు పీజీఆర్ఎస్ లాంటి అనేక వేదికలపై నుంచి రెవెన్యూ వినతులు స్వీకరించినా పరిష్కారం మాత్రం లభించడం లేదనేది ఇప్పటికీ వస్తున్న అర్జీలే నిరూపణగా ఉన్నాయి. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంపై ఇటీవలే ప్రభుత్వం ఓ సర్వే నిర్వహించగా బాపట్ల జిల్లాకు 19వ స్థానం దక్కింది. ఈ ర్యాంకు యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతుందని సోమవారం నాటి సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం

సమస్య ఒకటే ....కానీ అనేక వేదికలు

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెల చివరి వరకు కేవలం రెవెన్యూ సమస్యల మీదనే 3,478 అర్జీలు పీఆర్‌జీఎస్‌కు వచ్చాయి. ఇక ప్రభుత్వం (మిగతా 6లో)

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు.. రిమాండ్

సంతమాగులూరు, నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 23న బెంగళూరుకు చెందిన తండ్రీకుమారులైన రియల్టర్లు వీరస్వామిరెడ్డి, ప్రశాంత్‌ల హత్య కేసులో నిందితులను నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక వివాదాల నేపథ్యంలో తండ్రీకు మారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో సంతమాగులూరు గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం గోపిరెడ్డి, గడ్డం ఇంద్రసేనారెడ్డిల హతమార్చినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. సీఐలు ఎంవీ చరణ్, హైమారావు, బి.సుబ్బానాయుడు, పి.రామకృష్ణల నేతృత్వంలో ఎస్ఐలు హరిబాబు, వంశీకృష్ణ ప్రత్యేక బృందాలుగా ముంబయి వెళ్లి నిందితులను అరెస్టు చేశా రు. వీరిని బుధవారం నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆవుల సలోమి ఎదుట హాజరు ప రుచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు మొత్తం 13 మందిని నిందితులుగా పేర్కొన్నారు. గతంలోనే అనిల్ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురు నిందితులను మూడు రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉపాధి అవకతవకలపై తనిఖీలు

కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో పనుల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో ప్ర చురితమైన కథనా లపై కలెక్టర్ వెంకటమురళి స్పం దించి తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీలకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, కన్వీనర్ డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి బుధవారం బల్లికురవ వచ్చి తొలుత ఎంపీడీవో పాండురంగస్వామి, తహసీల్దారు రవి నాయక్‌లతో సమీక్షిం చారు. అనంతరం వారు మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో గత ఏడాది కా లంలో నిర్వహించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బోగస్ మస్టర్లుతో ఉపాధి నిధులు దుర్వినియెగం, పనుల్లో అవకతవకలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తా మన్నారు. ఉపాధి పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు, అంగన్‌వాడీ టీచర్లకు మస్టర్లు వేశారని ఫిర్యాదులపై విచారణ చేపడతామన్నారు.



వైదన గ్రామం వద్ద ఉపాధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● పాటిమీదపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే బీఎన్


కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై30(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బుధవారం సాయంత్రం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పాటిమీదపాలెంలో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ ఏడాదిపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, పాపిరెడ్డి, శివపార్వతి, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, తాతినేని రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కమలశ్రీ

నాగులుప్పలపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వాక్సినేషన్‌లో వైద్యఆరోగ్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి కమలశ్రీ సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలల సిబ్బందితో నాగులుప్పలపాడు ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు తప్పనిసరిగా రెండు టీటీ ఇంజక్షన్లు అందించాలని సూచించారు. శిశువులకు టీకాలు తప్పనిసరిగా అందించాలన్నారు. పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణిలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఐరన్‌మాత్రలు అందించాలన్నారు. మూడు సార్లు ప్రభుత్వ వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, ప్రసన్న, కుమారస్వామి, ఒనారియల్, హెల్త్ సూపర్‌వైజర్ శౌరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు సబ్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి సంధ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి వసతి, బిందు సేద్యం ఉన్న రైతులు అయ్యే ఖర్చులో 40 శాతం సబ్సిడీగా ఇస్తారని, అందులో 60 శాతం మొదటి సంవత్సరం 40 శాతం రెండో సంవత్సరం బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారన్నారు. పండ్ల తోటలకు ఇచ్చే రాయితీలు కూడా ఆమె వివరించారు. హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు రూ.9600, బంతి, చామంతి, మల్లెతోటలకు ఎకరాకు రూ.8వేలు చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ రూములు, కోల్డ్ రూమ్, సోలార్ పవర్ కోల్డ్ రూమ్‌లో మొదలైన వాటికి 35 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు రైతులు దరఖాస్తు చేసుకోవడానికి పాసు పుస్తకంతో ఉద్యానశాఖ కార్యాలయాన్ని సోమ, గురువారాల్లో సంప్రదించాలని, వివరాలకు 7995009758 సెల్‌నెంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం

ఒంగోలు కల్చరల్, జూలై 30(ఆం ధ్రజ్యోతి): శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ ఉద్బోధించారు. త్రేతాయుగంలో మానవ రూపంలో జన్మించి మనుషుడు అనుసరించాల్సిన ధర్మం, జీవన విధా నాన్ని ఆచరణలో చూపిన శ్రీరామచం ద్రుని జీవితాన్ని కలియుగంలో అందరూ పాటించాలని పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీలలితాశ్రమంలో ఆయన శ్రీరామవైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజీవితం సాఫల్యం కా వడానికి ఇహపర సౌఖ్యాలు పొందటానికి శ్రీరాముని ఆరాధన, శ్రీరామనామ జ పం ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శ్రీరామదాసు, త్యాగయ్య, పోతన వంటి వారు శ్రీరాముని కీర్తించారని వివరించారు. అనంతరం శివసుబ్రహ్మణ్య శర్మను ఆశ్రమ నిర్వాహకురాలు మాతా విజ్ఞానందసరస్వతి సత్కరించారు.

ఏడాదైనా.. ఎక్కడివక్కడే..!

(5వ పేజీ తరువాయి)

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులు దాదాపు 5,600. నేతలు క్రమం తప్పకుండా ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజాదర్బార్‌లు సరేసరి. మొత్తం అర్జీల పరిశీలనలో ఒకే సమస్యపై అదే వ్యక్తి దఫదఫాలుగా అర్జీల రూపంలో ఇచ్చినవి దాదాపు 950 వరకు ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీనే తిరిగి పీజీఆర్‌ఎస్‌కు రావడం ఒక ఎత్తయితే గ్రామ సభల్లో ఇచ్చినదానినే, మళ్లీ నేతల ప్రజాదర్బార్‌లో ఇవ్వడం ఇలాంటివి పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇందులో కొన్ని అధికారులు తిరస్కరించినా సరే ఇంకో వేదికమీదకు దానిని తీసుకెళుతుండడంతో అర్జీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇది కాకుండా సమస్య పరిష్కారం కాకపోవడం కూడా బాధితులు ఒకే అర్జీని అనేక వేదికలపై ఇస్తూ వస్తున్నారు

యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమే...

పెద్ద సంఖ్యలో రెవెన్యూ అర్జీలు వస్తుండడం, ఉన్న సిబ్బంది తక్కువగా ఉండడంతో వాటి డిస్పోజ్ ప్రణాళికబద్ధంగా జరగడం లేదని తెలుస్తోంది. పైగా అర్జీల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగానికి టార్గెట్లు పెడుతుండడంతో కేవలం గణాంకాలకే ప్రాధాన్యం ఇస్తూ, మమ అనిపించే విధంగానే ఈ తంతు జరుగుతుండడంతో అర్జీల పరిష్కారం ఎండమావిగానే మిగులుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. గ్రామసభలు, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను, పీజీఆర్‌ఎస్‌తో అనుసంధానం చేసినట్లు యంత్రాంగం చెబుతోంది. అన్నీ కలిపి దాదాపు 9,000 రెవెన్యూ అర్జీలను డిస్పోజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ వాటికి సంబంధించి విడివిడిగా గణాంకాలు అడిగితే లేవనే సమాధానమే సదరు వ్యవస్థల వద్ద నుంచి వస్తుండడంతో ఈ ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా జరుగుతుందో అర్థమవుతోంది

ఇక రీసర్వే మరో ప్రహసనం

గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో అనేక తప్పిదాలు జరిగాయి. వాటన్నింటిని సరిదిద్దడంతో పాటు ఈ ప్రభుత్వం మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసుకుని రెండు ఫేజ్‌లుగా రీ సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇది నెలల తరబడి సాగుతున్నా ఇప్పటికీ తొలి దశలో చేపట్టిన 25 గ్రామాలకు సంబంధించే ఫైనల్ ఆర్‌ఎల్‌ఆర్ సిద్ధం కాకపోవడం ఇది ఏ రీతిన సాగుతుందో తేటతెల్లం చేస్తోంది. పైగా రీసర్వే దాదాపు కొలిక్కి వచ్చిందని అధికారులు చెబుతున్న గ్రామాల నుంచే పదుల సంఖ్యలో అర్జీలు వస్తుండడం విస్మయపరిచేదిలా ఉంది. సిబ్బంది తక్కువగా ఉండడం వలన రీసర్వే వేగంగా జరగడం లేదనేది అధికారుల మాటగా ఉంది

కేవలం అంకెల్లోనే పరిష్కారం చూపే మొక్కుబడి తంతుకు రెవెన్యూ యంత్రాంగం స్వస్తి పలికి సమస్యకు ముగింపు పలకడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. లేకుంటే మరో నాలుగేళ్లు గడిచాక కూడా ఇదే స్థాయిలో రెవెన్యూ అర్జీలు వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కొప్పోలు రోడ్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం

● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


పులివెంకటరెడ్డికాలనీ జరుగుతున్న సైడుకాలువ నిర్మాణ పనులు

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేషన్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పులివెంకటరెడ్డికాలనీ వద్ద తవ్వకాలు చేపట్టారు. అయితే ఈ సైడుకాలువల నిర్మాణం చేసేందుకు రోడ్డు ఆక్రమణలో ఉన్న కట్టడాలకు అధికారులు గతంలో నోటీసులు ఇచ్చారు. కేవలం 10అడుగులు మాత్రమే అక్రమ కట్టడాలను తొలగించారు. మొత్తం మీద 20 అడుగులు ఆక్రమణలు ఉండగా, ఆక్రమణదారులు ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరుపుకుని పది అడుగుకులకు తగ్గించారు. ఈక్రమంలో సైడు కాలువల నిర్మాణాలకు రూ.2కోట్లు కేటాయించగా ఎట్టకేలకు పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

● కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విధుల్లో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన ఇరువురు సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం నగరంలోని పేర్నమిట్ట, అన్నవరప్పాడు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో, అలాగే పేర్నమిట్ట వద్ద అంబేడ్కర్ కాలనీలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సమయంలో హౌసింగ్ బోర్డు కాలనీలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా అక్కడే తగలబెట్టడాన్ని గుర్తించిన కమిషనర్ ఏరియా శానిటరీ సెక్రటరీ, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నమిట్ట సచివాలయంలో సిబ్బంది హాజరుపట్టికలో సంతకం చేయకపోవడంతో పాటు ఫీల్డు పేరుతో మరికొందరు గైర్హాజరు కావడాన్ని గుర్తించిన కమిషనర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటంపై వారిపై చర్యలు తీసుకోవాలని గుమస్తాకు ఆదేశించారు. అనంతరం పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల ఎన్ని ఉన్నాయి, ఎంతమందిని దత్తతకు గుర్తించారనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు.

పేద విద్యార్థికి కమ్మవారి సేవా సంఘం చేయూత

● స్కూలులో చేర్పించిన సభ్యులు


మధులోకేష్‌ను స్కూలులో చేర్పిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు(రూరల్)/చీమకుర్తి, జూలై30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామానికి చెందిన పేద విద్యార్థి చల్లా మధులోకేష్‌కు కమ్మవారి సేవాసంఘం తరపున ఉచిత విద్యాసౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఒంగోలులోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధులోకేష్‌కు తల్లిదండ్రులు లేరని, ఆ కుటుంబ సభ్యులు పేదరికంతో చదివించటానికి ఎవరూ ముందుకు రాలేదని, దీంతో బంధువులు కమ్మవారి సేవా సంఘాన్ని ఆశ్రయించారని పేర్కొన్నారు. సంఘం సభ్యులు నిర్ణయం మేరకు ఆ విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చులు భరించటానికి అంగీకరించారు. 9వ తరగతి చదువుతున్న మధులోకేష్‌ను చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్‌లో చేర్పించారు. ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యం, పుస్తకాలు, దుస్తులు, ఇతర ఖర్చులు భరించటానికి తీర్మానించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అలా హనుమంతరావు, ఐకే డోనర్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు కరిచేటి చంద్రశేఖర్, అంగలకుర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు విరివిగా రుణాలు

● ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు


ఎస్‌బీఐ నూతన భవన భూమిపూజలో పాల్గొన్న ఆర్ఎం అప్పలరాజు

కొండపి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణకు ఎస్‌బీఐ విరివిగా రుణాలు అందిస్తున్నదని బ్యాంకు కందుకూరు ఆర్ఎం వి.అప్పలరాజు అన్నారు. బుధవారం కొండపిలోని టంగుటూరు రోడ్డులో బ్యాంకు నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొండపి ఎస్‌బీఐ (వ్యవసాయాభివృద్ధి శాఖ)లో 1,800 మంది రైతులకు పంట రుణాలు అందించామన్నారు 256 డ్వాక్రా గ్రూపుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు చేయూత నిస్తున్నదన్నారు. 'అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్' పథకంలో రైతులకు ట్రాక్టర్లు, అనుబంధ యంత్రాలు, డ్రోన్లకు రుణాలిస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎం కార్యాలయ మేనేజర్ (హెచ్‌ఆర్) శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ బీఎం శరత్, పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వృద్ధాప్య తల్లిదండ్రులను జాగ్రత్తగా చూడాలి

● డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు సమాజానికి అనుభవ గనులని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, స్టేట్ రూల్స్-2011పై రీజనల్ రిసోర్స్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిడ్డలు తమ ఆస్తులను తీసుకున్నారే కానీ తమ పోషణ పట్టించుకోవడం లేదని ఇటీవల కాలంలో గ్రీవెన్స్‌లో పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సమాజంలో ఇలాంటి ధోరణి మంచిదికాదన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యతప్రతి ఒక్కరిపై ఉందని, వారి పోషణ, సంరక్షణ విస్మరించడం సరికాదన్నారు. చట్ట ప్రకారం అలా చేయడం శిక్షార్హమైన నేరమన్నారు. ఆయా చట్టాలపై జిల్లా అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు సువార్త, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రీజనల్ రిసోర్స్ శిక్షణ కేంద్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఖరారు

2న దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు రాక

అన్నదాత సుఖీభవ ప్రారంభం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి



ఒంగోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన వచ్చే నెల 2న దర్శి మండలం తూర్పువీరాయపాలెం వస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగ్రామంలో జరిగే సభలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన స్థలాన్ని బుధవారం సాయంత్రం జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆ ప్రాంతంలో పర్యటించి ఖరారు చేశారు. 2వ తేదీ ఉదయం 11 గంటలకు వీరాయపాలెం చేరుకునే సీఎం సాయంత్రం నాలుగు గంటల వరకూ అక్కడే ఉంటారు. తొలుత అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. గతానికి భిన్నంగా ప్రస్తుతం భారీ బహిరంగ సభలకు స్వస్తి చెప్పి పరిమిత సంఖ్యలో ఆయా వర్గాల ప్రజలతో ఇష్టాగోష్టి తరహాలో సమావేశాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవాన్ని కూడా అలానే నిర్వహించనున్నారు. దీంతో కార్యక్రమానికి ఎంపిక చేసిన తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన వారితోపాటు పరిమిత సంఖ్యలో పరిసర గ్రామ ప్రాంత రైతులతో సభ నిర్వహించాలని నిర్ణయించారు.

సీఎంవో అధికారుల జూమ్ కాన్ఫరెన్స్

కార్యక్రమ నిర్వహణపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌లతో బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆ ప్రకారం హెలీప్యాడ్, రైతుల సభ, కార్యకర్తల సమావేశం అన్నీ దగ్గరదగ్గరగా ఒకే ప్రాంతంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయనుండగా ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాత్రి సంబంధిత జిల్లా అధికారులతో మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా తూర్పు వీరాయపాలెంలో సమీక్ష చేసి తగు ఆదేశాలు ఇచ్చారు.

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లకు యంత్రాంగం సిద్ధమైంది. గురువారం ఉదయం నుంచి అక్కడ ఏర్పాట్లు ప్రారంభంకానున్నాయి. తొలుత తూర్పువీరాయపాలెంతోపాటు రాజంపల్లి, దర్శి శివారులోని శివరాజునగర్, ఇతర మరికొన్ని ప్రాంతాలను పరిశీలించినప్పటికీ ముఖ్యమంత్రి కార్యాలయ సూచనలకు అనుగుణంగా కార్యక్రమ నిర్వహణకు తూర్పువీరయపాలెం అనువుగా ఉంటుందని భావించి అక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, పలువురు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిచయం లేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాళ్ల ఇచ్చే పదార్థాలు తీసుకోవడం, మాయమాటలు నమ్మి వారి వెంట వెళ్లడం వంటివి చేయకూడదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు హెచ్‌ఎం రామయ్య అధ్యక్షతన నిర్వహించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

అద్దంకిటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన పాలపర్తి వెంకట్రావు అనే వ్యక్తినుంచి దేవరకొండ గోపి అనే యువకుడు (మార్కాపురం సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్) ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.5.36 లక్షలు తీసుకున్నాడు. పెద్ద మనుషుల ద్వారా లక్ష రూపాయలు తిరిగి ఇచ్చాడు. మిగిలిన డబ్బులు అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని వెంకట్రావు అద్దంకి పోలీసుతకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహ తెలిపారు.

ఒంగోలులో యువకుడి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం సుజాతనగర్ ఒకటో లైనులో దుద్దుకూరు బాలకృష్ణ(36) అనే యువకుడు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు బాలకృష్ణ బేల్దారి పనులకు వెళుతుంటాడు. ఇటీవల ఆయన హైదరాబాద్ వెళ్లి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో సాయంత్రం భార్య, కుమారుడు బయటకు వెళ్లగానే బాలకృష్ణ వరండాలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి షరీఫ్

ఒంగోలు విద్యజూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా అనేది వ్యవస్థీకరణ నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ షరీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మా నవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. మా నవ అక్రమ రవాణా అనేది నేరమన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి మాట్లాడుతూ పిల్లలు ప్రలోభాలకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఇందిర, బి.శ్రావణి, శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక స్మారక చిహ్నాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక స్మారక చిహ్నాలు, ప్రదేశాల పునరుద్ధరణపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ దేశంలో భారత పురావస్తు సర్వే సంస్థ పరిధిలో రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు 3,685 ఉన్నాయన్నారు. నిర్ణీత సమయాలలో ఈ సంస్థ తనిఖీలు నిర్వహించి ప్రస్తుత అవసరాన్ని బట్టి వాటి పరిరక్షణకు, నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 2020-21లో రూ.4.57కోట్లు, 2021-22లో రూ.5.75 కోట్లు, 2023-24లో రూ.14.70కోట్లు, 2024-25లో రూ.6.50 కోట్లు కేటాయించి ఖర్చుచేసినట్లు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత 15 రోజుల నుంచి భూములు దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యాయి. అప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు గురువారం రాత్రి మద్దిపాడు మండలంలో 6 సెం.మీ వర్షం కురిసింది. ప్రధానంగా మిరప, పత్తి, జొన్న, జనుము, మినుము, పిల్లిపెసర సాగుకు రైతులు సమాయాత్తమవుతున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

టంగుటూరు (కొండపి), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టాలని, కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్త్రీ, శి శు సంక్షేమశాఖ జిల్లా అధికారి సువర్ణ సూచించారు. కిశోర వికాసంలో భాగం గా కొణిజేడు హైస్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడా రు. బాలికల రక్షణకు అనేక చట్టాలున్నాయని అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం అధికారి లక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం చల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి నంద్యాలలో శిక్షణ తరగతులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 6వతేదీ వరకు నంద్యాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి విజ్ఞాన, వైజ్ఞానిక శిక్షణ తరగతులను వి జయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపుని చ్చారు. బుధవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని గత 50 ఏళ్ళ నుంచి పీడీ ఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిసింద్రీబాబు, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, సచిన్, యూనివర్శిటీ నాయకుడు హ రిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి అనర్థం

మద్దిపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పొగాకు వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన అనర్థం ఉంటుందని స్టేట్ ఫార్మసిస్ట్ సంఘం నాయకుడు ఎంపీ.రత్నకుమార్ పేర్కొన్నారు. బుధవారం బసవన్నపాలెంలోని పొగాకు కంపెనీల వద్ద కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు వల్ల లంగ్స్ దెబ్బతింటాయని, కూలీలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

జలాశయాల గణన చేపట్టాలి

మద్దిపాడు, జూలై 30(ఆం ధ్రజ్యోతి): రైతులకు మెరుగై న సాగునీటి సౌకర్యాలను అందించటానికి మండలంలో ఉన్న జలశయాల గణన చేపట్టాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగి న సమావేశంలో ఆయన మాట్లాడుతూ జలాశయాలు, చిన్నతరహా నీటి వనరుల గణన ప్రతి ఐదు సంవత్సరాలకు కేంద్రం నిర్వహిస్తుందన్నారు. గ్రామంలో ఉన్న భూగర్భ జలవనరులు, జలాశయాల గ ణనను చేపట్టాలని వీఆర్వోలకు సూచించారు. దీని వల్ల ప్రభుత్వం సాగునీటికి సంబం ధించిన కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సర్వేని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఏవో స్వర్ణలత మాట్లాడుతూ వీఆర్వో లను సమన్వయం చేసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులు ఈక్రాప్ నమోదు చేయా లన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో విజయలక్ష్మి, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

బిరబిరా.. కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. గంట గంటకు సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతుందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. తాడువాయి వద్ద మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

లంకలకు పొంచి ఉన్న ముప్పు..

కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతుండటంతో లంక గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. గత ఏడాది భారీ వరదల నుంచి తేరుకున్న రైతులను ఈ ఏడాది కూడా వరద భయం వెంటాడుతోంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 35 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నుంచి రక్షించాలని కృష్ణమ్మను వేడుకుంటున్నారు. బుధవారం రాత్రి 3 లక్షల పైచిలుకు క్యూసెక్కులు విడుదల చేస్తారని అధికారులు ప్రకటించడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాపట్ల కలెక్టర్ సమీక్ష

కృష్ణానది వరద నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాణనష్టం జరగకుండా పని చేసినట్లు ఇప్పుడు కూడా యంత్రాంగం పని చేయాలన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలతో పటిష్టపరచాలన్నారు. బియ్యం, నిత్యావసరాలు, పడవలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వరద ప్రభావితం అవుతాయన్నారు. గతం కంటే మెరుగుగా అధికారులు పని చేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.

- సత్రశాలలోని టెయిల్‌పాండ్‌లో 14 గేట్ల ద్వారా 2,94,109 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 91 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా రిజర్వాయర్‌లో 6.337 టీఎంసీల నీరుంది. 74.39 మీటర్లు అంటే 247.70 అడుగులకు ఇది సమానం.

- బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టులో 41.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 3,01,167 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 13,600 క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులను విడుదల అవుతుంది.

అవీ.. ఇవీ



కారంచేడు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎం హెచ్‌వో డాక్టర్ విజయమ్మ

మెరుగైన వైద్యసేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో విజయమ్మ

కారంచేడు(పర్చూరు), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ అన్నారు. బుధవారం కారంచేడు ప్రభుత్వ వైద్యశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని, డెలివరీలు పెంచేవిధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ పృధ్వీరాజ్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అక్కా చెల్లెళ్లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తైక్వాండో పోటీల్లో అక్కా చెల్లెళ్ల సత్తా

● ఒకరికి కాంస్యం, మరొకరికి రజిత పతకాలు

వేటపాలెం(చీరాల), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఓపెన్ తైక్వాండో పోటీల్లో వేటపాలెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన అక్కా చెల్లెళ్లు సత్తా చాటారు. వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన యార్లగడ్డ లక్ష్మీప్రియ, లాస్య ప్రియలు ఈనెల 25 నుంచి 27 వరకు విజయవాడలో జరిగిన పోటీల్లో పాల్గొని ఒకరు కాంస్య, మరొకరు రజిత పతకం సాధించారు. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరువురిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ సరోజని, పీఈటీ దేవభిక్షం, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఆరికట్లవారిపాలెం సమీపంలో రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

చిల్లచెట్లతో మూసుకుపోయిన రహదారి

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):చిల్లచెట్లతో రహదారులు మూసుకు పోవడంతో ప్రమాదం పొంచిఉంది. పంగులూరు నుంచి ఇంకొల్లు వైపు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో పంగులూరు, ఆరికట్లవారి పాలెం, గంగవరం గ్రామాల మధ్య పలుచోట్ల చిల్లచెట్లు ఇరు వైపుల నుంచి రోడ్డును కమ్మేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. చిల్లచెట్లతో రహదారి మూసుకుపోవడంతో వాహనచోదకులు ఎదురు వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారిలో రోడ్డును మూసేస్తున్న చిల్లచెట్లను తొలగించి ప్రమాదాలబారిన పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు వేడుకుంటున్నారు.

రైతులు పండించిన పొగాకంతా కొనుగోలు చేస్తాం

● చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. సంతమాగులూరు మార్కెట్ యార్డు లో పొగాకు కొనుగోలు కేంద్రా న్ని ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమకు నిర్దేశించిన సమయానికి పొగాకును తీసుకుని వచ్చి అమ్ముకోవాలన్నారు. గ్రేడ్‌ల వారీగా పొగాకును తీసుకు రావాలన్నారు. నిబంధనల మేరకు పొగాకును కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ పరిశీలనలో మార్కెట్ యార్డు చైర్మన్ తేలప్రోలు రమేష్, తహసీల్దార్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడవద్దు



సంతమాగులూరు మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం :నల్ల బర్లీ పొగాకు రైతులు అధైర్యపడొద్దని, చివరి ఆకు వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మీలు అన్నారు. చినగంజాం లోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ జె.ప్రభాకరరావు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. చింతగుంపల్లె పీఏసీఎస్ సీఈవో జి.శేఖర్, పొగాకు బయ్యర్లు, బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి కే. శ్యాంబాబు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి):అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కేవైసీ చేయించుకోని వారి జాబితా రైతుసేవా కేంద్రాలలో ఉన్నదని, 221 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని ఏవో తెలిపారు. పథకం లబ్ధి పొందే రైతులు తమ బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేసే పక్రియ వెంటనే పూర్తిచేయాలని సూచించారు. పంటసాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, గుంటుపల్లి రాధాకృష్ణ, వ్యవసాయ సహాయకులు పవిత్ర, రోజీ, రైతులు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : మండలంలోని సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతుల తమ బ్యాంకు అకౌంట్ల నెంబర్లకు ఎన్‌పీసీఐ యాక్టీవ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



చినగంజాం : పొలం పిలుస్తోంది గ్రామ సభలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్

విత్తనాలు కొనేటప్పుడు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలి

ఇంకొల్లు: రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా బిల్లు పొందాలని మండల వ్యవసాయాధికారి మేరమ్మ అన్నారు.లైసెన్సు ఉన్న దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.బుధవారం మండలంలోని భీమవరం,కొణికి గ్రామాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు సూచించండి

● డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులోని ఖాతాదారులకు సైబర్ నేరాలపై కచ్చితమైన జాగ్రత్తలు సూచించి నేర నియంత్రణకు సహకరించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం పట్టణంలోని బావనమ్మ కల్యాణ మండపంలో అన్ని బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు పరిసరాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. అలాగే సెక్యూరిటీ పరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్, ఇతర బ్యాంకుసేవలు వినియోగించుకునే ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

అలాగే బ్యాంకు అధికారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు శేషగిరిరావు, నాగభూషణం, ఎస్సైలు చంద్రశేఖర్. జనార్దన్, రాజ్యలక్ష్మి, వాణీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

మార్టూరు, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రోటరీ క్లబ్ సభ్యులు విద్యార్థులకు భోజనప్లేట్లను, గ్లాసులను ఎంఈవో వస్రాం నాయక్ పంపిణీ చేశారు. అదేవిధంగా స్కూలుకు 4 కుర్చీలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎం సాంబ శివరావు, జీహెచ్ నాగేశ్వరరావు,రావి అంకమ్మ చౌదరి, కె. హనుమంతరావు, చెరుకూరి అంజిబాబు, జాష్టి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

మండలంలోని కోనంకి విద్యుత్ ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మ్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు మార్టూరు సబ్ డివిజన్ డీఈఈ ఎం.సురేంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోనంకి పరిధిలోని కోనంకి, జొన్నతాళి,వలపర్ల, ఇసుకదర్శి, బొబ్బేపల్లి, చిమ్మిరిబండ గ్రామాలలో గృహ,వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విధులలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన విద్యాలయంలో విదులలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు అని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ(డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను అయన పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ట్యాబ్‌ల ద్వారా ఎలా చదువుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనకబడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రవినాయక్ పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలంలో విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ (డిప్యూటీ కలెక్టర్) నాగిరెడ్డి

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సబ్ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోరుతూ పోలీసులను ఆశ్రయించే వికలాంగ బాధితులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. బుధవారం డీఎస్పీ ఎండీ మొయిన్‌ను కలిసి కాలేషా మాట్లాడారు. స్టేషన్‌లకు వచ్చే వారి పట్ల ప్రేమగా మెలగాలని, వీల్ చైర్‌లు, ర్యాంపులు ఏర్పాటు చేసి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంటనే సమస్యలపై పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కాలేషా వెంట పలువురు వికలాంగులు ఉన్నారు.

సెయింట్ ఆన్స్‌కు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరు

చీరాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అటల్ ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ గ్రాంట్ మంజూరయినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తద్వారా ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీ, కాన్సెప్ట్ రీసెర్చ్, ట్రెండ్స్ అండ్ ప్రాసెస్, చాలెంజెస్, పాలసీ అండ్ కాంపినెన్స్‌కు సంబంధించి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 6 రోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించిన పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

దేవాలయ భూములకు పెరిగిన కౌలు

బల్లికురవ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామంలో ఉన్న దేవాలయాల భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. ఈ ఏడాది దేవాలయ భూముల కౌలు వేలం పెరిగిందని దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు.రామలింగేశ్వరస్వామికి చెందిన 14.40 ఎకరాలకు రూ. 2.12 లక్షలకు వేలంలో రైతులు పాడారని అలానే చెన్న కేశవ స్వామి ఆలయానికి చెందిన 6.25 ఎకరాల భూమికి రూ. 1.76 లక్షలకు వేలం పాడారు. గత ఏడాది కంటే వేలం పాట పెరిగిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

స్వామిత్వ సర్వేపై సిబ్బందికి శిక్షణ

పంగులూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠం కేంద్రంగా సాంకేతికతను వినియోగించి స్వామిత్వ సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి సంపద కార్డులు జారీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్ తెలిపారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాలలో స్వామిత్వ సర్వేపై సిబ్బందికి రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ నియామకం

రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు 2025 - 26 సంవత్సరానికి నూతన కమిటీ నియామకం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా పంగులూరుకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ, కార్యదర్శిగా అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావులు నియమితులయ్యారు.

ఉపాధ్యక్షుడిగా చిలుకూరి ప్రసాద్‌నాయుడు, కోశాధికారిగా షేక్ కాలేషావలి, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా గుర్రం ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా రావూరి రంగారావు నియమితులయ్యారు. ఈ నెల 31న నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించనుంది.

నేడు అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం

అద్దంకి,జూలై30(ఆంధ్రజ్యోతి): అద్దంకి పురపాలక సంఘం అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. 20 అంశాల అజెండాతో సమావేశం జరుగుతుందన్నారు.



మార్క్‌ఫెడ్ ఎండీ కరుణశ్రీ నుంచి వివరాలు అడిగి తెలుసుకొంటున్న మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత

గోడౌన్‌ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయ సునీత

పర్చూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసి నిల్వచేసే విధంగా అందుబాటులో ఉన్న గోడౌన్‌లను సిద్ధం చేయాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్, ఎండీ విజయ సునీత అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులకు సరిపడ గోడౌన్‌లు అందుబాటులో లేకపోవటంతో కొనుగోలుకు కొంత ఇబ్బందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎంత పరిమాణంలో కొనుగోలు చేశారు, గోడౌన్‌ల పరిస్థితి అన్నవిషయంపై బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ ఎండీ కరుణశ్రీతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రణాళిక ప్రకారమే విద్యాభ్యాసం

వేటపాలెం(చీరాల), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళిక బద్ధంగా విద్యాభ్యాసం చేయాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులకు సాంఘిక ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు, అవ్వారు సుజాత, జయంతి ఉచితంగా సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయిని సరోజని మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా స్టడీ మెటీనియల్ సిద్ధం చేసినట్లు వివరించారు. పల్నాడు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మిరియాల శివశంకర్ అండ్ టీం అత్యంత వేగవంతంగా మెటీరియల్ తయారు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాల్వపనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మేజరుకు మరమ్మతులు ప్రారంభం

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలో ఉన్న ఇడుపులపాడు సాగర్ మేజరు కాల్వ మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. కాల్వకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లతో పాటు కాల్వ పూడిక తీత పనులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు,కొణికి పీఏసీఎస్ చైర్మన్లు కరి శ్రీనివాసరావు,బోడెంపూడి సుబ్బారావు,నీటి సంఘం అధ్యక్షుడు బత్తుల రామకృష్ణ, టీడీపీ టౌన్ అధ్యక్షుడు వలేరు మార్క్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పర్చూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల అలవాటుకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దని ఎస్సై జీవీ చౌదరి సూచించారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, ఎస్సై సాంబశివరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగించుకోవాలి

చినగంజాం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీబీ చినగంజాం శాఖ మేనేజర్ డి.పోతురాజు అన్నారు. మండలంలోని మన్నంవారిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న పథకాలు, సేవలపై బ్యాంకు ఖాతాదారులకు బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాదారుడు ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడండి

ఇంకొల్లు,జూలై 30,(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య అన్నారు.ఇంకొల్లు సర్కిల్ కార్యాలయంలో బుధవారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూడాలని అన్నారు. ఇంకొల్లు ఎస్సై సురేష్,ఇంకొల్లు పరిధిలోని అన్నీ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.


రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం
నిప్పులు చిమ్ముతూ నింగిలోకి వెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్

నిసార్ హుషార్

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం సక్సెస్
- నిర్దేశిత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- ఈ ఏడాది ఇస్రోకు తొలి విజయం

సూళ్లూరుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రయోగానికి 27.30 గంటల ముందు.. మంగళవారం తెల్లవారుజామున 2.10 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. '0'కి చేరగానే.. సమయం బుధవారం సాయంత్రం 5.40 గంటలు అయింది. అంతే ఒక్కసారిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ నిప్పులు చెరుగుతూ.. నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసి 18.40 నిమిషాల్లోనే 2,392 కిలోల బరువైన నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో-నాసా సంయుక్తంగా చేపట్టిన ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించడంతో షార్‌లో సంబరాలు మిన్నంటాయి. శాస్త్రవేత్తలు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం.. రోదసి ప్రయోగాల్లో మరోసారి మన శాస్త్రవేత్తల సత్తా చాటింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు ఆరు వేల మందిదాకా వచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీక్షకులు మధ్నాహ్నమే షార్‌కు తరలి వచ్చారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు తెల్లవారుజాము నుంచే వాహనాలు బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో వీక్షకుల చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాకెట్ నింగికెగిరినంతరం విజయవంతం కావడంతో వీక్షకులు గ్యాలరీ వద్దే ఆనందంతో సంబరాలు చేసుకొన్నారు.

● సవాల్‌గా తీసుకుని..

ఈ ఏడాది జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 ప్రయోగం అనంతరం ఉపగ్రహ సంకేతాలు అందలేదు. అనంతరం మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగం విఫలం చెందింది. ఈ రెండు వైఫల్యాలను శాస్త్రవేత్తలు సవాల్‌గా తీసుకున్నారు. మూడోసారి.. అత్యంత ఖరీదైన, నాసా, ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేసిన నిసార్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మన శాస్త్రవేత్తలకు అగ్ర దేశాల నుంచీ ప్రశంసలు అందాయి. కాగా, ఈ ఏడాది ఇస్రోకు ఇది తొలి విజయం. కాగా, భూ పరిశీలన, సునామీ, విపత్తుల హెచ్చరికలు ముందుగానే పసిగట్టి సమాచారాన్ని చేరవేసేందుకు నిసార్ ఎంతో దోహదపడుతుంది.


ప్రయోగాన్ని వీక్షిస్తున్న నాసా శాస్త్రవేత్తలు



చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం

ఇది చరిత్రలో నిలిచిపోయే ప్రయోగం. బుడిబుడి అడుగల నుంచి నేడు స్వదేశీ పరిజ్ఞానంతో అమెరికా వంటి అగ్రదేశంతో కలిసి భారీ ప్రయోగాలు చేపట్టే స్థాయికి ఎదిగాం. ఇదంతా మన శాస్త్రవేత్తల సమష్టి కృషి ఫలితమే. ఊహించిన ప్రకారమే నిసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాం. ఇది ఇస్రో,నాసా ఘన విజయం.

- వీ.నారాయణన్, ఇస్రో చైర్మన్

● రాకెట్ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు

షార్ వేదికగా జరిగిన నిసార్ ఉపగ్రహ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కె.రాధాకృష్ణ, ఏఎస్.కిరణ్ కుమార్ విచ్చేశారు. వీరిలో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు.


వీక్షకుల గ్యాలరీలో విద్యార్థుల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పాల్గొన్న డీఏవో సత్యవాణి, తదితరులు

వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను మేళవించి, రైతులకు లాభసాటిగా తయారుచేయ డమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో బుధవారం అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా తీసుకువచ్చే వ్యవసాయ మార్పులపై వ్యవసాయ అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిస్టాక్ అనేది రైతు రిజిస్ట్రీ, జియోరిఫరెన్స్ విలేజ్ మ్యాప్, క్రాప్ సోన్ రిజిస్ట్రీతోసహా ముఖ్యమైన వ్యవసాయ డేటాసెట్‌లను ఏకీకృతం చేసే సమాఖ్యని తెలిపారు. ఇది యూనిఫైడ్ ఫార్మర్ సర్వీస్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఏకీకృతం చేయబడు తుందని, బ్యాంకులు, బీమాసంస్థలు, వ్యవసాయ సాంకేతిక సంస్థలు, ప్రభుత్వ విభాగాలతోసహా వాటాదారుల మధ్య సజావుగా డేటా భాగస్వామ్యాన్ని అనుమతిస్తుందని వివరించారు. తద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెంచుకోవడమే కాకుండా మార్కెటింగ్ సదుపాయాలు కూడా విస్తృత పరచుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్ప, మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

చర్చ సాగకనే...

- మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం
- 132 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం
- చేసిన పనుల ఆమోదానికే అన్నట్లుగా నిర్వహణ
- తప్పుబట్టిన పలువురు కార్పొరేటర్లు

నెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశమంటే.. స్థానిక సమస్యలపై చర్చలు.. అభివృద్ధి పనుల ఖర్చులపై లెక్కలు... తదితర అంశాలు గుర్తుకొస్తాయి.... కానీ బుధవారం నిర్వహిం చిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఇందుకు భిన్నంగా సాగింది. ఒక్కటంటే ఒక్క అజెండా అంశంపై కూడా చర్చ లేకుండానే ముగిసింది. జరిగిపోయిన పనులను ఆమోదించుకునేందుకు సమా వేశం ఏర్పాటు చేసినట్లుగా ఉంది. ప్రధాన అజెండాలో 111 అం శాలు, సప్లమెంటరీ అజెండాలో 6 అంశాలు, టేబుల్ అజెండాలో 15 అంశాలను కౌన్సిల్ ముందుంచారు. ప్రధాన అజెండాలోని అన్నీ అంశాలూ ర్యాటిఫి కేషన్ (ధ్రువీకరణ)కు సంబంధించినవే కావడం గమనార్హం. అంటే ఈ పనులు, నిర్ణయాలు ఇదివరకే జరిగిపోయాయి. ఇప్పుడు నామమాత్రంగా వాటిని ఆమో దించేలా అధికారులు అజెండా రూపొందించారు.

● కార్పొరేటర్ల అభ్యంతరం

కౌన్సిల్ అజెండాపై సమావేశంలో పలువురు కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అజెండా మొత్తం ర్యాటిఫికేషన్ అంశాలే ఉండడం తానెప్పుడూ చూడలేదని, రాష్ట్రంలో ఎక్కడా ఇలా జరిగి ఉండదని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ వ్యాఖ్యానించారు. కౌన్సిల్‌లో చర్చించకుండానే పనులు చేసేసి, ఆ తర్వాత కౌన్సిల్‌లో పెట్టడం ఏం పద్ధతని నిలదీశారు. ఇదే తీరున కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, కిన్నెర మాల్యాద్రి కూడా ప్రశ్నించారు. అజెండాలో చర్చించే అంశాలే లేనప్పుడు ఇక తామెందుకంటూ కొందరు కార్పొరేటర్లు కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు.


సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి

కాగా ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం ఒకటన్నర గంటలోనే ముగిసింది.

● మాట్లాడింది కొద్దిమందే..

సమావేశంలో 54మంది కార్పొరేటర్లతోపాటు పలువురు కోఆప్షన్ సభ్యులుండగా, వారిలో కొద్దిమంది మాత్రమే మాట్లాడారు. వారంతా స్థానిక సమస్యలను ప్రస్తావించారు. వెంకటే శ్వరపురంలోని టిడ్కో ఇళ్ల వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాల్ అద్దె తగ్గించాలని, నగరంలోని కొన్ని సచివాలయాల పరిధిలో శానిటేషన్ సిబ్బంది కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. బోడిగాడితోట శ్మశాన వాటికలో రాత్రి ఏడు దాటితే అంత్యక్రియలు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థలోని కొందరు వ్యక్తులు ఆప్కాస్ కింద ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని విచారించాలని డిప్యూటీ మేయర్ తహసీన్ కోరారు. నగరపాలక సంస్థలో ఒక సర్వే రిపోర్టు తీసుకోవాలంటే సామాన్యుడికి రూ.25 వేలు ఖర్చవుతోందని ఈ దోపిడీని అరికట్టాలని మరికొందరు కోరారు. కాగా కార్పొరేషన్‌లో గతంలో జరిగిన ఫోర్దరీ సంత కాల వ్యవహారం ఏమైందని, అక్రమ లేఅవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి ప్రశ్నించారు.

● అధికారుల స్పందనేదీ ?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారుల స్పందన సున్నాగా ఉందని కో ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆరోపించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జనసేన తరపున ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అదికారులకు తాము ఫోన్లు చేసి చెప్పినా స్పందించడం లేదని ఆరోపించారు. టిడ్కో గృహాలపై అధికారులు దృష్టి సారించి, వేగవంతంగా లబ్ధిదారులకు అందజేయాలని ఆయన కోరారు.

● రూ.43.72 కోట్ల పనులకు ఆమోదం

కౌన్సిల్ సమావేశం ముగిశాక మేయర్ స్రవంతి మీడియాతో మాట్లాడారు. మొత్తం 132 అజెండా అంశాలను సభ్యులంతా ఆమోదించినట్లు తెలిపారు. నగరంలో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10.36 కోట్లతో ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థ స్థలాలకు కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు రూ.5.37 కోట్లు, పారిశుధ్య పనుల్లో హైడ్రాలిక్ మిషన్లు, స్వీపింగ్ మిషన్ల కోసం రూ.10.18 కోట్లు, డ్రైనేజీ క్లీనింగ్, పార్కుల అభివృద్ధి, నగర సుందీకరణ కోసం రూ.6.95 కోట్లు, దర్గా అభివృద్ధి కోసం రూ.2.26 కోట్లు, వాహనాల కోసం రూ.2.46 కోట్లు, వీఆర్ హైస్కూల్‌లోని విద్యార్థుల రవాణా కోసం బస్సుల కొనుగోలుకు రూ.5 కోట్లు, గణేష్ ఘాట్ పనుల కోసం రూ.10 లక్షలు కేటాయిస్తూ తీర్మానించగా, కౌన్సిల్ సభ్యులంతా ఆమోదం తెలిపినట్లు ఆమె వివరించారు. మొత్తం గా ఈ సమావేశంలో రూ.43.72 కోట్ల పనులను ఆమోదించినట్లు మేయర్ వివరించారు.

వైసీపీ నేతలకు నోటీసులు

- నిబంధనలు పాటించాలని ఆదేశాలు
- జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు
- నేటి జగన్ పర్యటనకు 900 మందికిపైగా పోలీసుల బందోబస్తు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన ఐజీ

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నాటి జిల్లా పర్యటన ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలను పోలీసుశాఖ చేపట్టింది. ఇప్పటికే ముఖ్యమైన వైసీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు. జగన్ పర్యటనలో నిబంధనలు పాటించాలని, జన సమీకరణ చేయరాదని, చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. జగన్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజు ల నుంచి ఆయన జిల్లాలో ఉంటూ అధికారు లకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా బుధవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జిల్లాకు చేరుకున్నారు. జగన్ పర్యటనలో గతంలో పలు జిల్లాలో జరిగిన సంఘటనలు పునారావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.. ఏయే చర్యలు చేపడుతున్నారు...? అనే అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు.

● మాజీ సీఎం పర్యటన ఇలా...

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 10.30 నుంచి 11 గంటల లోపు చెముడుగుంటలోని డీటీసీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్క డ నుంచి పోలీసు అనుమతించిన జెడ్‌ప్లస్ కేటగిరి క్యాన్వాయ్‌తో పాటు నాయకులకు కలిసి మరో మూడు వాహనాల్లో నెల్లూరు సెంట్ర ల్ జైలుకు చేరుకుంటారు. అక్కడ ముగ్గురు నేత లతో కలిసి లోపలికి వెళ్లి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అవుతారు. అనంతరం నగరంలోని మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకుంటారు. ప్రసన్న ను పరామర్శించి రోడ్డు మార్గాన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.


వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి నోటీసులు అందించి, మాట్లాడుతున్న బాలాజీనగర్ సీఐ సాంబశివరావు

● భారీ బందోబస్తు

జగన్ పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 22 మంది ఇన్‌స్పెక్టర్లు, 891 మంది ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు , కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, హోమ్‌గార్డులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. 10 డ్రోన్ కెమెరాలు, 40కుపైగా సీసీ కెమెరాలతో జగన్ పర్యటన మొత్తం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో లైవ్ ద్వారా అధికారులు పర్యవేక్షిస్తుంటారు. బైక్ ర్యాలీలు, నిరసనలు, ప్రజలు గుంపులుగా ఉండటం, రెచంచగొట్టేలా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించడం... ఇలా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు చేపట్టేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు. కాగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పీ.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసన్న కుమార్‌రెడ్డితో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముఖ్య నాయకులకు పోలీసులు ఇప్పటికే నోటీసులు అందచేశారు.

బందోబస్తు అధికారులతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



● బ్రీఫింగ్ నిర్వహించిన ఐజీ

ఈ సందర్భంగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 900 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో మాజీ సీఎంకు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. భద్రతాపరంగా ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అన్నీ చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా పర్యవేక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక బృందాలను నియమించామని ఆయన వివరించారు. జగన్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానంలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్, అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	248

కోడిగుడ్ల ధర (100): 475

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం రాష్ట్ర ప్రజలకు అందుతోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డు పోతురాజుమిట్ట, ఇస్లాంపేట ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడుపనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలిసంవత్సరంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, షేక్ ఖలీల్, షేక్ సలాంబాషా, అబ్దుల్‌రెహమాన్, రఫీ, గౌస్‌బాషా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కలిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటనపై ఆంక్షలు ఉండటంతో, కలిగిరి సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, జలదంకి, వింజమూరు మండలాల్లో జనసమీకరణకు అనుమతులు లేవని సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. ఈ 4 మండలాల పరిధిలో వైసీపీ నాయకులు ఎవరైనా జనసమీకరణ జరిపినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఫ్లెక్సీలు ఏర్పాటు, ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

● కందుకూరు(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహనరెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి వైసీపీ నాయకులు జనసమీకరణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు గుంపులుగా వెళ్లటం, రెచ్చగొట్టేవ్యాఖ్యలు చేయటం, వివాదాస్పదమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం నిషిద్ధమని తెలిపారు. జనసమీకరణ చేసి ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా తరలించాలని చూసినా, ర్యాలీగా నెల్లూరుకు బయలుదేరినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

● అల్లూరు(ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి కార్యకలాపాలకు ఉపక్రమించేందుకు అనుమతులు లేవని ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్ ప్లస్ భద్రతా ఉన్నందున మండలం నుంచి వైసీపీకి చెందిన నాయకులు ఎటువంటి ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు తదితర కార్యక్రమాలకు పాల్పడకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున రోడ్ షోలు, ప్లకార్డులు, రెచ్చగొట్టే నినాదాలు, బ్యానర్లు నిషేధించబడ్డాయని, జనసమీకరణ కార్యక్రమాలకు పాల్పడవద్దని పేర్కొన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● కొండాపురం(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు పర్యటనకు మండలంలో జన సమీకరణ చేయవద్దని ఎస్ఐ మాలాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జనాలను సమీకరించి వాహనాలలో తరలించడం, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ర్యాలీలు చేయడం నిషేధమన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉందని నిబంధనలు ఉల్లంఘించిన నేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్



లింగసముద్రంలో వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నీటి సరఫరా జరిగే వాటర్ ట్యాంకుల నుంచి కలుషితమైన నీరు సరఫరా అవుతుండడంతో అధికారులు పలు గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశాల మేరకు లింగసముద్రం పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, లింగసముద్రం, జంగంరెడ్డిపాలెం గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు, గంగపాలెంలోని మంచినీటి ట్యాంకును పంచాయతీ కార్యదర్శి ఎం.మాధవరావు సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం ట్యాంకులకు నీరు నింపి సరఫరా చేశారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నూకసాని



బీజేపీ శ్రేణులకు ధన్యవాదాలు చెబుతున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఎన్నికయ్యారు. నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు గడ్డం విజయకుమార్‌రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, కంచపాక కమలతో కలసి జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిలో నూకసాని ఎన్నిక కావడంతో ఆయన నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

» వీధుల్లో పారుతున్న మురుగు
» కాలువల్లో కదలని వ్యర్థాలు
» దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
» బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీల్లో దుస్థితి
» పట్టించుకోని పాలకులు, అధికారులు



బోగోలు యాదవపాలెంలో రోడ్డుపై మురుగునీరు

బిట్రగుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు అధ్వానంగా ఉండడంతో మురుగునీరు ముందుకు కదలక వీధుల్లోకి చేరుతోంది. వ్యర్థాలు ఎక్కడికక్కడ నిల్వచేరడం, అందులో పందులు సంచరిచడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల నివాసాలు ఉండే ప్రజలతోపాటు ఆ ప్రాంతంలో తిరిగే ప్రజలు దుర్వాసనను భరించలేక ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ప్రధానంగా బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీల్లో నెలకొంది. అయినా పంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. బోగోలు మేజర్ పంచాయతీలో ప్రధాన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడి నాయకులు ఎవరూ వాటి గురించి పట్టించుకోవడం కానీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కానీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. యాదవపాలెం నాలుగు రోడ్ల కూడల్లో ప్రధాన కాలువ దెబ్బతినడంతో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. రైల్వే ఎల్సీగేట్-143 చుట్టుపక్కల నుంచి వచ్చే కాలువల మురుగు యాదవపాలెం మీదుగా ఊరి బయటకు ప్రవహించాలి. అయితే ఆ కాలువ పూడిపోయి అస్తవ్యస్తంగా ఉంది. దీంతో సాధారణ రోజులతో పాటు వర్షాకాలం రోడ్డుపైన మురుగు నిల్వ ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ కాలువల గురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే నేతల మధ్య పార్టీలు, వర్గవిభేదాల కారణంగా పంచాతీల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ నేపథ్యంలో పాతహరిజనవాడ, మసీదువీధి, కుమ్మరవీధి, బృందావనం వీధిలోని కాలువలు పూర్తిగా దెబ్బతిని ఇళ్లలోని మురికి నీరు, వ్యర్థపదార్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి, వర్షాకాలంలో ఈ ప్రాంతంలో తిరగాలంటే ప్రజలు హడలిపోతున్నారు.



వీఎన్ఆర్‌పేట జడ్పీ హైస్కూల్ వద్ద అధ్వానంగా డ్రైనేజీ కాలువ

● మరో మేజర్ పంచాయతీ అయిన విశ్వనాథరావుపేటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పంచాయతీకి నిధులు తక్కువైనా జనాభా ఎక్కువగా ఉంటారు. ఇబ్రహీంపేట, విశ్వనాథరావుపేట, రామస్వామిపాలెంలో ఇటీవల కాలంలో సిమెంట్ రోడ్లు నిర్మించినా సైడ్ కాలువలు ఏర్పాటు చేయకపోవడం, పాత కాలువలు పూర్తిగా దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసనతో స్థానికులు అల్లాడుతున్నారు. విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలబాలికల పాఠశాల వద్ద ఉన్న కాలువ అధ్వానంగా మారి పందులకు నిలయంగా మారింది. అదే విధంగా పంతులువీధి, తూర్పు ప్రధాన కాలువ, మాజీ సర్పంచు వై.సుందరమూర్తి ఇంటి పక్కన ప్రధాన కాలువ, మసీదు ఎదురు ప్రధాన కాలువల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. కాలువలు దెబ్బతినడంతో పాటు కొన్ని కాలువలు ఆక్రమణలతో పూడిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. మేజర్ పంచాయతీలో ప్రధాన కాలువలే దుస్థితిలో ఉంటే మిగిలిన పంచాయతీల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలని, పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయ సలహా తీసుకుని అభ్యంతరాలు తెలియచేస్తాం..



రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్

ఉలవపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరేడులో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు అభ్యంతరాలు తెలియచేయాలని, అలాగే భూముల పత్రాలు సమర్పించాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ సిబ్బందితో వచ్చారు. 1210 మంది రైతులకు నోటీసులు అందించగా, 631 మంది మూకుమ్మడిగా అర్జీలు సమర్పించారు. అభ్యంతరాలపై ఆగస్టు 18వ వరకు గడువు ఇచ్చినందున, లాయర్లను నియమించుకొని వారి సలహా మేరకు అభ్యంతరాలు తెలియపరుస్తామని వారంతా ఆ వినతిపత్రాల్లో పేర్కొన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే అజయ్‌కుమార్, సీ పీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్, తదితరులు మాట్లాడుతూ రైతులను మభ్యపెట్టేందుకే ఎకరా భూమికి రూ.20 లక్షలు అంటూ ప్రకటన ఇచ్చారని అన్నారు. మొండిగా భూసేకరణకే మొగ్గు చూపితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు నిల్!

● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

వలేటివారిపాలెం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రజలకు పట్టణ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేసేలా ఏర్పాట్లు చేసింది. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, పీహెచ్‌సీల్లో జరిగే ప్రసవాలపై నమ్మకం లేక వేలకు వేలు వెచ్చించి పట్టణాల్లోని ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. దీంతో పీహెచ్‌సీలో ప్రసవాలు లక్ష్యం నెరవేరడం లేదు. వలేటివారిపాలెంలో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అందులో తగినంతమంది వైద్యులు, సిబ్బంది ఉన్నారు. అంతేగాకుండా అవసరమైన వైద్య పరికరాలు ఉన్నాయి. అయితే పీహెచ్‌సీలో ఏడాదికి 60 కాన్పులు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఈ పీహెచ్‌సీలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వలేటివారిపాలెం పీహెచ్‌సీలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి వరకు 16 ప్రసవాలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 1, మేలో 1, జూన్‌లో 1 ప్రసవాలు జరిగినట్లు వైద్యులు తెలిపారు. అంటే సరాసరిన నెలకు 1 ప్రసవం జరిగినట్లు వైద్యులు తెలిపారు. మూడు నెలల్లో మూడు ప్రసవాల సంఖ్య దాటలేదంటే ఎలాంటి పరిస్థితి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

● ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

పీహెచ్‌సీలో ప్రసవాలు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డాక్టర్ శివసిద్ధప్ప తెలిపారు. అయినప్పటికీ గర్భిణులు పెద్దగా స్పందించడం లేదు. మండలంలో 21 పంచాయతీలు ఉండగా, 10 పంచాయతీల ప్రజలు కందుకూరు పట్టణానికి దగ్గరలో ఉండడం వలన స్థానిక పీహెచ్‌సీకి రాకుండా కందుకూరు వెళ్తున్నారు.

పసుపులేటి కుటుంబానికి పలువురి పరామర్శ



వెంకటరమణయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, తదితరులు

బిట్రగుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంకు చెందిన త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ అధినేత, పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ సోదరుడు పసుపులేటి వెంకటరమణయ్య (చిన్నస్వామీజీ) ఈనెల 10వ తేదీ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఉత్తర క్రియలు బుధవారం స్వగ్రామంలో సుధాకర్, సుగుణమ్మ దంపతులు జరిపించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంజనేయరెడ్డి, సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్ఎస్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, మాజీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకుడు సతీష్ నాయుడు మిత్రబృందంతో కలిసి వచ్చి పసుపులేటి కుటుంబాన్ని పరామర్శించారు. కావలి నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, పీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు సుధాకర్ దంపతులను పరామర్శించారు.

పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ సర్వే

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



పారిశుధ్య నిర్వహణపై సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ సర్వే చేయిస్తుందని, పారిశుధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు వస్తాయని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ చాంబరులో బుధవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్, పట్టణంలోని సచివాలయ కార్యదర్శులుతో మున్సిపల్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ సర్వేలో రామమూర్తి పేట ఏరియా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడంతో వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో ఇంటింటికి వచ్చి చెత్త సేకరిస్తున్నారా, మీకు సమీపంలో చెత్తతో నిండిన చెత్తకుండీలు ఉన్నాయా, డ్రైనేజీలు తీస్తున్నారా తదితర ప్రశ్నలను ప్రజలను అడుగుతున్నారన్నారు. శానిటరీ కార్యదర్శులు తమ ప్రాంతాల్లోని ప్రజలను కూడా చైతన్యపరిచి మీరు చేస్తున్న సర్వీస్‌లకు మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. పారిశుద్యం మెరుగుదలకు ఎప్పటి కప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇంటింటికి చెత్త సేకరణ ఆగకుండా నిత్యం దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. మీ పనితీరు ఐవీఆర్ సర్వేలో బయటపడుతోందని కనుక జర జాగ్రత్తగా పనిచేయలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సామూహిక వరలక్ష్మీవ్రతం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, ఈవో తదితరులు

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్లశాంభవి ఆలయ ప్రాంగణలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మున్సిపల్, దేవదాయ శాఖ అధికారులు స్థానిక టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ఆలయానికి ఉత్తరం వైపున ఉన్న వరవకాలువ వలన ఆలయ ప్రాంగణం కుదించుకు పోవటమే కాక వాస్తుసమస్య కూడా ఉండటంతో ఆ కాలువపై రూ.60 లక్షలతో కాంక్రీట్ శ్లాబ్ పనులు చేపడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆ పనులను పరిశీలించి కాలువపై శ్లాబ్ నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఆగమన శాస్త్రప్రకారం అక్కడ ప్రహరీ నిర్మించేందుకు హద్దులను గిర్తించి మార్కింగ్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆగస్టు 8వ తేదీన ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలను నిర్వహిస్తుండటంతో వాటికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, ఆలయ ఈవో రాధాకృష్ణ, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోట్లూరి శ్రీనివాసులు, రాజకుమార్‌చౌదరి, అమరా వేదగిరి, తిరువీదిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానంపై భయమెందుకు..?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి



పోలీసు నోటీసు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(టౌన్), జూలై 30(ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌కు ఉన్న ప్రజాభిమానంపై ప్రభుత్వానికెందుకంత భయమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంలో అరాచక పాలన సాగుతుందన్నారు. ప్రశ్నించే గొంతులను నులిపేస్తున్నారని, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాన్ని అణిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. జగనన్న జిల్లా పర్యటనపై ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుంటారని, నెల్లూరు వెళ్లవద్దని వైసీపీ నేతలకు పోలీసు నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. వైసీపీ కార్యకర్తలు జగన్ అభిమానులు సంఘ విద్రోహ శక్తులా అని ప్రశ్నించారు. కావలిలో అవినీతి అక్రమాలకు కర్త కర్మ క్రియ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అని, అతను పైకి చెప్పేది నీతులని, మైనింగ్, ఇసుక, గ్రావెల్, రియల్ ఎస్టేట్ అవినీతి దందాలు వెనకుండి నడిపిస్తున్నారని ఆరోపించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి చేసింది వైసీపీ ప్రభుత్వమని, త్వరలో చంద్రబాబు ప్రారంభిస్తారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు




రక్తగ్రూపు పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థినులు

కావలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులకు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ రక్తగ్రూపును కచ్చితంగా తెలుసుకుని ఉండాలన్నారు. ఎన్‌సీసీ అధికారి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ విద్యార్థులకు రక్తగ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థులు కావలి రెడ్‌క్రాస్ సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీ. సరళకుమారి, సృజన, వాసవి, బీజనార్ధన్‌రెడ్డి, విజయభారతి, రెడ్‌క్రాస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, శేషమ్మ, అనిల్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్!

● పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు ● అవస్థలు పడుతున్న ప్రజలు

గుడ్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గుడ్లూరు ఎమ్మెస్సార్ కాలనీ దగ్గర ఏడాది క్రితం రూ.36 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్ నేటికీ వినియోగంలోకి రాక నిరుపయోగంగా ఉంది. దీంతో జగనన్న కాలనీతోపాటు, సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలని భావించిన ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్‌తోపాటుగా మెయిన్ పైప్‌లైన్, నీటి కులాయిలు కూడా ఏర్పాటు చేసినప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం కారణంగా గత సంవత్సర కాలంగా వినియోగంలోకి రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న సుమారు 50 కుటుంబాల వారు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే వాటర్‌ట్యాంక్ ఉన్నప్పటికీ అది వినియోగంలోకి రాకపోవడంతో చేతిపంపులు, నేలబావుల వద్దకు వెళ్లి తాగడానికి, వాడుకునేందుకు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అనేక సార్లు పంచాయతీ అధికారుకు, స్థానిక నాయకుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో చేసేదిలేక తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ఆయా ప్రాంత ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సాగర్‌ను వివరణ కోరగా.. ట్యాంక్ పనులు పూర్తిచేసి పంచాయతీ అధికారులకు, గ్రామ సర్పంచుకి అప్పగించారని, వాళ్లకు నీరు వదిలే మనిషి లేకపోవడంతో ఈ ట్యాంక్ వినియోగంలోకి రాలేదన్నారు.



నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

పొదలకూరు సర్పంచికి షోకాజ్ నోటీసులు

పొదలకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్థులు, టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన డివిజనల్ పంచాయతీ అధికారి పలు అంశాలపై వివరణ కోరుతూ బుధవారం సర్పంచికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2020 నుంచి ఈఏడాది జూన్ వరకు రికార్డులపై విచారణ జరిపారు. సర్పంచి మల్లికా చిట్టెమ్మ సక్రమంగా రికార్డులను నిర్వహించడంతో విఫలమయ్యారని, నిధుల దుర్వినియోగంకు పాల్పడినట్లు, చర్యలు తీసుకోవాల్సిందిగా నివేదికలో పొందుపరిచారు. కాగా, సర్పంచిగా మల్లికా చిట్టెమ్మ తన విధులు నిర్వర్తించడంలో విఫలమైందని భావించి సమర్పించిన విచారణ నివేదిక మేరకు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారంలోగా తగు ఆధారాలతో లిఖితపూర్వకమైన సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అందులో పేర్కొన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

వెంకటాచలం సర్పంచికి కూడా...

వెంకటాచలం: గ్రామ పంచాయతీ సర్పంచి మందల రాజేశ్వరికి బుధవారం డీపీవో శ్రీధర్‌రెడ్డి షోకాజు నోటీస్ జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని టీడీపీ నేత సండి రమేష్, ఇతర గ్రామస్థులు ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈవిషయమై ఇటీవల డీఎల్‌పీవో పంచాయతీని సందర్శించి నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. మందల రాజేశ్వరి సర్పంచిగా తన విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని, విచారణ నివేదిక మేరకు సంజాయిషీ కోరుతూ షోకాజు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన ఏడు రోజులలోగా తగిన ఆధారాలతో లిఖిత పూర్వకమైన సంజాయిషీ ఇవ్వాలని, ఈమేరకు జారీ చేసిన షోకాజు నోటీసులో పేర్కొన్నారు. లేకుంటే తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- మండల కన్వీనర్ నియామకంపై అసహనం
- మేకపాటిని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీపీ భర్త


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఉదయగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి వైసీపీలో వర్గవిబేధాలు భగ్గుమన్నాయి. ఇటీవల మండల వైసీపీ కన్వీన్‌గా కొండా రాజాగోపాల్‌రెడ్డిని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియమించారు. అతని నియామకం పట్ల ఓ వర్గం నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తూ దూరంగా ఉన్నారు. ఈ తరుణంలో బుధవారం ఎంపీపీ మూలె పద్మజ భర్త, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి తన స్వగ్రామమైన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు రాజకీయ భిక్ష పెట్టింది మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డన్నారు. తన సతీమణి ఎంపీపీ అయినా అటు ప్రభుత్వ, ఇటు సొంత నిధులతో మండలాన్ని అబివృద్ధి చేస్తున్నామన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ సస్పెండ్ చేసినా, పార్టీ మారినా మండలంలో నాయకులు ఎవరూ ఆయన వెంట వెళ్లకుండా కాపాడుకుంటూ వచ్చానన్నారు. అనంతరం అధిష్టానం మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తే ఆయన వెంట నడిచి ఆయన గెలుపునకు కృషి చేసినా దురదృష్టవశాత్తు ఓడిపోయామ న్నారు. అయినప్పటికీ తాము ఆయన వెంట ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల మండల వైసీపీ కన్వీనర్ నియామకం విషయంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఇతర నాయకులను సంప్రదించకుండా ఆయనకు ఇష్టమొచ్చిన వారిని నియమించుకున్నారన్నారు. ప్రజలతో సత్సంబంధాలు, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిని కన్వీనర్‌గా నియమించి ఉంటే బాగుండేదన్నారు. ఆయన ఎవరినైతే కన్వీనర్‌గా నియమించారో ఆ వ్యక్తి ఈరోజు కొంత మంది నాయకులకు ఫోన్ చేసి తాను నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వెళ్లరాదని బెదిరింపులు చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కన్వీనర్‌గా నియమించిన వ్యక్తి కుటుంబం 2019 వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేసిందో గుండెమీద చేయి వేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. మీ కుటుంబమే పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే తాను పోరాడనన్నారు. పార్టీని ఎవరు భ్రష్టు పట్టించారో ఆలోచించుకోవాలని హితవు పలికారు.


కలిగిరి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

పొగాకు ధరలో మార్పేది?

- రైతుల ఆందోళన

కలిగిరి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ల ప్రారంభించి నాలుగు నెలలు దాటుతున్నా గరిష్ఠ ధరల్లో మార్పు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఈ ఏడాది పొగాకు కంపెనీలు ఆచితూచి పొగాకు కొనుగోళ్లు చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పొగాకు సాగుచేసిన రైతులకు మార్కెట్ అనుకూలించడంతో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.300 మైలురాయి దాటడంతో రికార్డు ధరలు దక్కాయి. దీంతో ఈ ఏడాది కూడా అదే రీతిలో ధరలు దక్కుతాయన్న ఆశతో పొగాకుబోర్డు అనుమతించినదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి అధిక ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది ప్రారంభంలో మేలిమి పొగాకు ధర కిలో రూ.280 పలుకగా లోగ్రేడ్ పొగాకు ధర రూ.220 పలికింది. అయితే ప్రారంభంలో మేలిమి పొగాకుకు అందిన ధరలో నేటికీ మార్పు లేకుండా రూ.280గా ఉండటం, లోగ్రేడు పొగాకు ధర కిలో రూ.160 ప్రకారం కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మేలిమి పొగాకు గరిష్ఠ ధర పెరగకపోవడంతో రైతులు ఎక్కువ శాతం లోగ్రేడు పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. మార్కెట్‌లో లోగ్రేడు పొగాకు డిమాండ్ లేదనే కారణంతో కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో. పొగాకును తిరిగి ఇంటికి తీసుకెళ్లాలంటే శ్రమతో పాటు రవాణా ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024-25 పంట కాలానికి 5.2 మిలియన్ కేజీల పొగాకుకు బోర్డు అనుమతించగా ఇప్పటి వరకు 4.6 మిలియన్ పొగాకు అమ్మకాలు జరిగాయి. రైతులవద్ద ఇంకనూ 3మిలియన్ల కేజీలకు పైగా పొగాకు ఇళ్లవద్ద ఉంది. కొనుగోళ్ల చివరి దశలో మద్దతు ధరలు దక్కుతాయని మేలిమి పొగాకును ఇళ్లవద్దనే ఉంచి లోగ్రేడ్ పొగాకును ఎక్కువగా తీసుకువస్తున్నారని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. రైతులు మాత్రం ఈఏడాది కూలీల ఖర్చు, పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయని మేలిమిపొగాకు గరిష్ఠ ధరలను పెంచడంతోపాటు లోగ్రేడు పొగాకును కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

పొణకా కనకమ్మకు 'భారతరత్న' ఇవ్వాలి

- ఆశయ సాధన సమితి సభ్యులు


విలేకరుల సమావేశంలో కనకమ్మ సేవల కరపత్రం చూపుతున్న సాధన సమితి సభ్యులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, గొప్పదాత పొణకా కనకమ్మకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని శ్రీమతి పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ బీ సురేంద్రనాథ్‌రెడ్డి భారత ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నెల్లూరులోని టౌన్‌హాల్ రీడింగ్ రూములో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో కనకమ్మ సేవలు, దాతృత్వానికి సంబంధించి ప్రధాన మంత్రి మోదీకి 110 పేజీల నివేదిక పంపామని చెప్పారు. కనకమ్మ దానం చేసిన ఆస్తుల ప్రస్తుత విలువ రూ.2500 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో నెల్లూరు నగర నడిబొడ్డున కస్తూరిదేవి విద్యాలయం 21 ఎకరాల్లో ఉందని తెలిపారు. పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమానికి 22 ఎకరాలను ఆమె దానం చేశారని, నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్ద కస్తూరిదేవి ఇండస్ట్రియల్ స్కూల్‌ను స్థాపించారని చెప్పారు. తన కుటుంబ యావదాస్తి సూర్యచంద్రాదులు ఉన్నంతవరకు బాలికల ఉచిత విద్యకే ఉపయోగపడాలని 1926-27లో సొసైటీ కింద రిజిస్టర్ చేసి కస్తూరి దేవి విద్యాలయాన్ని స్థాపించారని వివరించారు. 1947లో భర్త పొణకా సుబ్బరామిరెడ్డి మరణానంతరం కనకమ్మ తమిళనాడులోని శ్రీరమణ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారని తెలిపారు. అక్కడ భగవద్గీతను తెలుగులోకి అనువదించారని, ఆ అనువాద పద్యాలను శ్రీరమణ మహర్షి స్వహస్తాలతో తిరిగి రాశారని పేర్కొన్నారు. అంతటి మహనీయురాలికి భారతరత్న ప్రకటించాలని కోరారు. కనకమ్మ సేవలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆ సమితికి చెందిన చలంచర్ల భాస్కర్‌రెడ్డి, షేక్ సందాని బాషా, దగ్గుమాటి కృష్ణయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం


శివకుమార్(ఫైల్)

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జీ శివకుమార్ (43) బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... నవాబుపేట పోలీసు క్వార్టర్స్‌లో శివకుమార్, స్వరూప దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. శివకుమార్ తల్లిదండ్రులు విడవలూరు మండలం ముదివర్తిలో ఉంటు న్నారు. మంగళవారం శివకుమార్ తన తండ్రిని చూసివస్తానని భార్యతో చెప్పి ముది వర్తికి వెళ్లాడు. తిరిగి బుధవారం తెల్లవారుజామున బైక్‌పై నెల్లూరుకు బయలు దేరారు. నగరంలోని ప్రశాంతినగర్ జంక్షన్ దాటి కొద్దిదూరం వచ్చేసరికి బైక్ మరమత్తుకు గురైంది. దీంతో శివకుమార్ నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్, నవాబుపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శివకుమార్ భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. శివకుమార్ మృతికి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

క్షయ నివారణకు ఇంటింటా సర్వే

ముక్త భారత్ అభియాన్ పేరుతో కార్యక్రమం

- డిసెంబరు వరకు నిర్వహణ
- జిల్లాలో 4,12,421 మందికి టీబీ పరీక్షలే లక్ష్యం
- ఇప్పటికి 22 శాతం ఇంటింటా సర్వే పూర్తి


ఇంటింటా సర్వే చేస్తున్న క్షయ విభాగం అధికారులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్షయ వ్యాధి నివారణను పక్కాగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎక్కడెక్కడ వ్యాధిగ్రస్థులు ఉన్నారు... వారి పరిస్థితి ఎలా ఉంది...? అన్న కోణంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. క్షయను పూర్తిగా అరికట్టాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. దీని ద్వారా ఇంటింటికి తిరిగి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్నారు. దీర్ఘకాలికవ్యాధులు ఉన్నవారిలో క్షయవ్యాధిగ్రస్థులు ఉన్నారా ? అన్న కోణంలో ఈ సర్వే జరుగు తుంది. సర్వేలో భాగంగా మద్యం, పొగతాగేవారు, పొగాకు ఉత్ప త్తులను విరివిగా ఉపయోగించే వారిని పరీక్షిస్తు న్నారు. అలాగే మధుమేహం బాధితులు, 60 ఏళ్లు పైబడిన వారు, బాడీమాస్ ఇండెక్స్ 18.5 కంటే తక్కువ ఉన్నవారు, క్షయవ్యాధిగ్రస్థుల ఇంట్లో మూడేళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటెన్సిఫైడ్ టీబీ పేరిట జిల్లాలో 4,12,421 మందికి పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ విభాగం నిర్ణయించి, పరీక్షలు చేస్తున్నది.

22 శాతం మందికి పరీక్ష

ఇప్పటివరకు జిల్లాలో 22 శాతం అనగా 88,390 మందికి క్షయ పరీక్షలు నిర్వహించామని అధికారులు తెలిపారు. వీరిలో 224 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించామని వారు పేర్కొన్నారు. జూన్ 2న ఈ ముక్త భారత్ అభియాన్ ప్రారంభం కాగా, డిసెంబరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.కాగా ప్రభుత్వపరంగా 12,00 మందికి క్షయ వ్యాధి చికిత్సలు అందిస్తున్నట్లు అధికారులు చెబుతుండగా, వారి సంఖ్య ప్రైవేట్ ఆసుపత్రులతో కలుపుకుని 13వేలు ఉంటుందని తెలుస్తోంది. ఏటా క్షయ వ్యాధితో 100 మంది మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆధునిక వైద్యసేవలు

1992లో సవరించిన జాతీయ క్షయ నివారణ పథకం కింద జిల్లాలో 37 గళ్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ అనుమానితల గళ్ల పరీక్షలు చేసి వ్యాధి ఏ స్థాయిలో ఉందో గుర్తిస్తారు. క్షయ వ్యాధి తీవ్రత ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్) గుర్తించేందుకు డామియల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆధునాతన పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాధారణస్థాయి క్షయ వ్యాధికి ప్రత్యక్ష పర్యవేక్షణలో (డాట్స్) పద్ధతిలో చికిత్స అందిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి రూ. రెండు లక్షల విలువైన చికిత్సను ఉచితంగా అందచేస్తారు. జీజీహెచ్‌లో వ్యాధి స్థాయిని త్వరగా నిర్ధారించే అత్యాధునిక సీబీనాట్ పరికరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దాదాపు రూ.30 లక్షల తో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీనెలా జిల్లా వ్యాప్తంగా 500కుపైగా గళ్ల పరీక్షలను చేసి క్షయ వ్యాధి స్థాయిని నిర్ధారిస్తున్నారు..

పక్కాగా ఇంటింటా సర్వే



క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఇంటింటా సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నాం. ఇందులో క్షయ నివారణ అధికారులతోపాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొంటున్నారు. వీరు క్షయ వ్యాధికి సంబంధించిన అన్నీ పరీక్షలు చేస్తారు. తద్వారా వ్యాధిని గుర్తిస్తున్నారు. ప్రభుత్వ పరంగా క్షయవ్యాధి గ్రస్థులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో క్షయవ్యాధిని నియంత్రిస్తున్నాం.

\- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం
- టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ సమీపంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్య క్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిం చడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రస్తుతం ఎంతోమంది యువత నైపుణ్యాలు ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరులో నిర్వహించు జాబ్‌మేళాకు ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు సువర్ణ అవ కాశమన్నారు. ఈ అవకాశాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గాదం వాసు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీలో సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు తూర్పుగోదావరి జిల్లాలో ఆగస్టు 14 నుంచి 17వతేదీ వరకు జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

'ఎల్‌ఆర్‌ఎస్'ను సద్వినియోగం చేసుకోండి

- లేఅవుట్లతోపాటు వ్యక్తిగత ప్లాట్లకూ అమలు
- నుడా చైర్మన్ కోటంరెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), జూలై 30(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సంబంధిత యజమానులు సద్వినియోగం చేసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి పిలుపునిచ్చారు. నుడా కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా అనధికార లేఅవుట్లు వేశారన్నారు. వాటిలో ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ అనుమతి లేకపోవడంతో స్థలాలు కొన్న వారు తీవ్ర ఆందోళన చెందారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ చొరవతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. దీంతో అనధికార లేఅవుట్లతోపాటు, వ్యక్తిగత ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. గతంలో క్రమబద్ధీకరణకు స్థలం విలువలో 14శాతం చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం 50శాతం రాయితీ కల్పించినట్లు చెప్పారు. అలాగే రైల్వే, రక్షణశాఖల నుంచి ఎన్‌వోసీ సమర్పించాల్సిన అవసరం లేకుండా చేశారన్నారు. స్థలాల క్రమబద్ధీకరణకు అక్టోబరు 24లోపు లైసెన్సుడ్ సర్వేయర్లు, ఇంజనీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కోటంరెడ్డి తెలిపారు. అలాగే 45రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లిస్తే 10శాతం రాయితీ, 90 రోజుల్లోపు చెల్లిస్తే 5శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నుడా పరిధిలో 450 మేర అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించామని, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో చర్చించి, ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ పథకంపై సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్‌సెంటర్‌ను నుడాలో ఏర్పాటు చేశామని, 86399 73397 ,8555871815 నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో నుడా ప్లానింగ్ అధికారులు హిమబిందు, కాలేషా, ఏపీవోలు కుముదిని, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2వతేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-23 సీనియర్ మహిళల జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎస్ రాజశేఖర్ రెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారి ణులు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్టు, వైట్ డ్రస్ కోడ్‌తో పాల్గొనాని, మరిన్ని వివరాలకు స్టేడియంలోని క్రికెట్ ప్రాంగణంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రాధాన్యత ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం),(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాధాన్యత ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయ న చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని, ఎంబుక్ చేసిన ఒక నెల లోపు బిల్లులు తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. సాగునీటి కాలువల పనులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి పరిహారం వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సోమశిల, తెలుగ గంగ ప్రాజెక్టులు, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు వెంకట రమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, దేశ్‌నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆత్మ పీడీగా మురళి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐ మురళి నెల్లూరులోని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించే దిశగా కృషి చేస్తానని, వ్యవసాయ అనుబంధ శాఖలను సమన్వయపరుచుకుంటూ క్షేత్ర స్థాయిలో పర్యటి స్తానని చెప్పారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

నెల్లూరు(క్రైం), జూలై 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న నిందితుడిని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను బుధవారం స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. వరుసగా ద్విచక్రవాహనాల చోరీలు జరుగుతుండటంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశామని చెప్పారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప ప్రాంతానికి చెందిన పీట్ల వంశీగా గుర్తించామన్నారు. బుధవారం గొలగ మూడి క్రాస్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు ద్విచక్రవాహనాలు అపహరించినట్లు అంగీకరించాడన్నారు. రూ.2.50 లక్షల విలువ కలిగిన ఆ వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చాటిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ నవీన్‌కుమార్, సాయికల్యాణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


నిందితుడి వివరాలు తెలుపుతున్న వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

సోమశిల జలాశయంలో 32 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 13,330 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా జలాశయంలో 32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారన్నారు.

వరకట్న వేధింపు కేసు కొట్టివేత

నెల్లూరు (లీగల్): కట్టుకున్న భార్యను వరకట్నం కోసం వేధించారన్న కేసులో నేరం రుజువు కాకపోవడంతో నలుగురిపై నమోదైన కేసు కొట్టివేస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ ఇన్‌చార్జి జడ్జి నిషాద్ నాజ్ షేక్ బుధ వారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరు రూరల్ మండలం నరుకూరుకు చెందిన షేక్ షమీలాకు తిరుపతి పట్టణానికి చెందిన షేక్ కరిముల్లాతో 2012 ఆగస్టు 26న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో షమీలా తల్లి దండ్రులు 15 సవర్ల బంగారు, రూ.5 లక్షల కట్నం ఇచ్చారని, వివాహానంతరం ఒక సంవత్సరం పాటు కువైట్ వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లిన కరిముల్లా మూడేళ్ల వరకు తిరిగి రాలేదని, వచ్చిన తరువాత తల్లి షేక్ మామాజీగిని, అతని అక్క షేక్ కలీమా, బావ షేక్ మహ బూబ్ బాషాతో కలిసి అదనపు కట్నం కోసం షమీలాను వేధించి ఇంటి నుంచి తరిమివేశారని అభియోగం. షమీలా నెల్లూరు మహి ళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే విచారణ కాలంలో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుల తరఫున న్యాయవాదులు పీసీ కృష్ణయ్య, పీసీ కృష్ణ ప్రియాంకాదేవి వాదించారు.

సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

- సుమారు రూ.కోటి ఆస్తి నష్టం


తగలబడుతున్న ట్రాన్స్‌ఫార్మర్

కావలిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు.. 8 మెగా వాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ బుషింగ్ రాడ్ దగ్గర స్పార్క్ వచ్చి ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి మేర నష్టం వాటిల్లింది. విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, కావలి ఈఈ బెనర్జీ ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరగటానికిగల కారణాలను తెలుసుకున్నారు. ఈ ట్రాన్స్‌ఫ్మార్ దగ్ధం కారణంగా తుమ్మలపెంట, చినరాముడిపాలెం, కొత్తసత్రం, కొండాయగారి పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అర్ధరాత్రి నుంచి అంధకారంలో ఉన్నారు. బుధవారం ఉదయం అధికారులు అన్నగారిపాలెం, చెన్నాయపాలెం సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్‌ను ఆయా గ్రామాలకు పునరుద్ధరించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో చిత్తూరు నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తెప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దానిని గురువారం ఏర్పాటు చేయనున్నారు. కాగా సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.